
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 18 జనవరి 2024 | 3



సడలని పోరు : రాజమహేంద్రవరంలో సంజాయిషి పత్రాలు గోడలపై అతికిస్తున్న అంగన్‌వాడీలు

4 రోజులు..రూ.5.52 లక్షలు



నిడదవోలు, జనవరి 17 : తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూకట్టారు. దీంతో 4 రోజులు ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో భోగి, సంక్రాంతి, కనుమ, ముక్క నుమ నాలుగు రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున మొక్కుబడులు చెల్లించుకున్నారు. 4 రోజులు అమ్మవారికి మొత్తం రూ.5,52,351లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా షర్మిళారెడ్డి 5



అంగన్‌వాడీల ఆగ్రహం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 17 : రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వానికి పట్టదా అని అంగన్‌వాడీలు మండిపడ్డారు. గత 37 రోజులుగా ఆందోళన చేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు బుధవారం రాజమహేంద్రవరం, కొవ్వూరులో ఐసీడీఎస్ కార్యాలయాలకు వెళితే సీడీపీవో కార్యాలయం సిబ్బంది రిప్లయ్ తీసుకోవడానికి నిరాకరించారు. దీనిపై అంగన్‌వాడీలు మండిపడ్డారు. మా ఓట్లతో గెలిచి మాపై పెత్తనమేంటని.. సీఎం జగన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎంత సేపటికి కార్యాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రాజమహేంద్రవరంలో ఐసీడీఎస్ కార్యాలయం గోడలకు సమాధాన పత్రాలు అతికించారు. షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ వేచి ఉన్నా సిబ్బంది స్పందించకపోవడంతో షోకాజ్‌లకు రిప్లయ్‌లను కార్యాలయం గోడలకు అతికించి వెనుదిరిగామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాజమహేంద్రవరం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు శారద, సునీత తెలిపారు. దీనిపై సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో నోటీసులపై రిప్లయ్‌లు తీసుకుంటుంటే ఇక్కడ మాత్రం ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, జిల్లా కమిటీ సభ్యుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు..రూటు!

- రానుంది ఓట్ల పండగ
- త్వరలో ఎన్నికల నోటిఫికేషన్
- సిద్ధమవుతున్న అభ్యర్థులు
- త్వరలో టీడీపీ తొలిజాబితా
- అదే బాటలో జనసేన
- నాలుగో జాబితాకు వైసీపీ సన్నద్ధం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగ వెళ్లిపోయింది. ఓట్ల పండగ రానుంది. ఇక సందడంతా ఎన్నికల మీదే. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. గెలుపు గుర్రాలను ఎంపిక చేసుకునే ప్రక్రియలో నిమగ్నమయ్యాయి. త్వరలోనే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. తెలుగుదేశం- జనసేన పొత్తువల్ల ఆ పార్టీ నుంచి టికెట్లు ఆశించే వారి సంఖ్య బాగా పెరిగింది. సంక్రాంతి పండుగ తర్వాత టీడీపీ అభ్యర్థుల తొలిజాబితా వస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. జనసేన అభ్యర్థుల పేర్లు త్వరలోనే వెల్లడిస్తారు. జిల్లాలో ఒక లోక్‌సభ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో టీడీపీకి రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ దక్కాయి. టీడీపీ అధినేత సిట్టింగ్‌లకు మళ్లీ టికెట్లు ఇస్తామని గతంలో చేసిన ప్రకటన వల్ల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అర్బన్ నుంచి ఆదిరెడ్డి కుటుంబం హుషారుగా పార్టీ పనిలో నిమగ్నమయ్యాయి. అనపర్తి, రాజానగరం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు స్థానాల్లో గత ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందింది. అందులో ఇప్పటికే గోపాలపురం ఇన్‌చార్జిగా మద్దిపాటి వెంకట్రాజు, రాజానగరం ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణను నియమించారు. అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పార్టీ కోసం పనిచేస్తున్నారు. నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సీనియర్ నేత కుందుల సత్యనారాయణ టికెట్ ఆశిస్తున్నారు. ఇద్దరూ పార్టీ కోసం పని చేస్తున్నారు.కొవ్వూరులో ఇన్‌చార్జిలేరు. ద్విసభ్య కమిటీ ఉంది. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు టికెట్లు ఆశిస్తున్నారు.ఏది ఏమైనా అధినేత నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రకటించిన జాబితాలో ఉన్నవారే అభ్యర్థులవుతారు. కానీ టీడీపీకి జనసేనతో పొత్తు ఉండడం వల్ల టీడీపీ అభ్యర్థుల టిక్కెట్ల ఖరారుపై టెన్షన్ నెలకొంది.జనసేన నుంచి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరం రూరల్ సీటు ఆశిస్తున్నారు. రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ టికెట్ ఆశిస్తున్నారు.కొవ్వూరు నుంచి మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నిడదవోలు నుంచి ఓ సినీ నిర్మాత జనసేన టికెట్ ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కొద్దిరోజుల్లోనే టీడీపీ,జనసేన అభ్యర్థులెవరనేది తేలనుంది. వైసీపీలో గందరగోళం ఇంకా కొనసాగుతూనే ఉంది. గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు కూడా వేరే చోటకు బదిలీ అయ్యే పరిస్థితుల వల్ల గందరగోళం ఉంది. ఇప్పటికే రాజమహేంద్రవరం రూరల్‌కు మంత్రి చెల్లుబోయిన వేణు, సిటీకి ఎంపీ మార్గాని భరత్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే.మిగతా చోట్ల ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. కొవ్వూరులో హోంమంత్రి తానేటి వనిత ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది బహుశా నాలుగో జాబితాలో స్పష్టత రావచ్చు. ఒకటి రెండు రోజుల్లో నాలుగో జాబితా ప్రకటించే అవకాశం ఉంది.ఆమెను కొవ్వూరు నుంచి కొందరు వ్యతిరేకిస్తున్నారు.ఆమె కూడా గోపాలపురం వైపు చూస్తున్నట్టు ప్రచారం ఉంది.ఆమెను మారిస్తే మరి కొన్ని మార్పులు ఉండవచ్చు. రాబోయే ఎన్నికలు ప్రజలకు ఓట్ల పండగ, రాజకీయనేతలకు ఓట్ల పందెంగా మారనుంది.

ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా

రాజమహేంద్రవరం, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ఓటర్ల తుదిజాబితా ఈనెల 22న ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ డా. కె.మాధ వీలత తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఓటర్ల తుది జాబితా ప్రకటించినా నామినేషన్లు స్వీకరణ తుది రోజు వరకూ ఓటరుగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు చెప్పారు. కొత్తగా నమోదు చేసిన వారి పేర్ల సప్లిమెంటరీ జాబితాగా ప్రకటిస్తామన్నారు. ఈవీఎంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి జన సమూహాలు ఉండే ప్రాంతాల్లో శాశ్వత సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అక్టోబరు 27నాటికి ఎస్ఎస్ఆర్ 2024 ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్లు 15,60,354 మంది ఉండగా అందులో 7,63,694 మంది పురుషులు 7,96,552 మంది మహిళలు 108 మంది ఇతరులు ఉన్నారన్నారు. కానీ జనవరి 1వతేదీ నాటికి ఈ సంఖ్య బాగా పెరిగిందని మొత్తం ఓటర్లు సంఖ్య 16,05,762 కాగా, పురుషులు 7,85,142 మహిళలు 8,20,515మంది ఉన్నా రన్నారు. సమావేశంలో జేసీ ఎస్.తేజ్‌భరత్, డీఆర్వో జే.నరసింహులు, ఆర్డీవో ఏ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ.. పండక్కే!

వస్తాం ... మళ్లొస్తాం



- ముగిసిన సంక్రాంతి పండుగ
- నాలుగు రోజులు మూడు క్షణాలుగా గడిపేసిన వైనం
- పట్టణాల వైపు పల్లెజనం ఉరుకులు పరుగులు
- బస్సులు..రైళ్లు ఫుల్.. రోడ్లపై భారీగా వాహనాలు
- శని, ఆదివారాల్లో మరిన్ని ప్రత్యేక బస్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

361 రోజులు ఎదురు చూసిన నాలుగు రోజుల పండుగ సరదా సరదాగా మూడు క్షణాల్లో గడిచిపోయింది. సొంత ఊరుతో సంతోషాన్ని పంచుకొని చుట్టాలు సొంతగూళ్ల దారి పట్టారు. వెళ్లొస్తాం 'మళ్లీ పండక్కి' వస్తాం.. అంటూ తీపి జ్ఞాపకాలతో బరువెక్కిన గుండెలతో.. చెమర్చిన కళ్లతో.. కులాసా కబుర్లను చెంగున కట్టుకొని.. కష్టసుఖాలను మనసున పెట్టుకొని మళ్లీ ఉరుకుల పరుగుల జీవనంలోకి బయలుదేరింది బంధుగణం. దీంతో రైళ్లు, బస్సులు కిక్కిరిసిపోగా.. కార్లు, బైకులతో రహదారులు నిండిపోయాయి.

సంక్రాంతికే ప్రత్యేకం

ఏడాదిలో ఏ పండుగకూ లేని ప్రత్యేకత సంక్రాంతికి ఉంది. ఈ పండుగ భోగి రోజు మొదలై నాలుగో రోజున ముక్కనుమతో ముగుస్తుంది. ముక్కనుమ రోజున అధిక శాతం మంది నైవేద్యాలు పెట్టుకుంటారు. బంధుగణానికి మాంసాహారంతో పసందైన విందును వండి వడ్డిస్తారు. ఆ రోజుతో ఆ ఏడాదికి సంక్రాంతికి వీడ్కోలు పలుకుతారు. నాలుగు రోజుల పాటు ఉల్లాసంగా గడిపి ఎన్నో ఊసులను మనసు నుంచి దించుకున్నారు. మరెన్నో కబుర్లను మన సున ముడేసుకున్నారు. పండక్కి మా ఊరెళ్తున్నాం.. చుట్టాలింటికి వెళ్తున్నాం.. అంటూ ఇరుగు పొరుగు వారికి నెల ముందు నుంచే సంబరంగా చెప్పుకొని రెక్కలు కట్టుకుని వాలిపోయారు. నాలుగు రోజులు మూడు క్షణాల్లో గడిచిన తర్వాత అప్పుడే పండుగ అయిపోయిందా!? అనుకుంటూ ఉసూరు మంటూ నగరాలకు బయలుదేరారు.సినిమాలు,షికార్లు, కోడిపందేల్లో జరిగిన ఎన్నో విషయాలను వారితో తీసుకెళ్లారు.ఆ తరువాత బంధు గణం బ్యాగులు సర్దుకొని తిరిగి పయనమవుతారు.ఈ నాలుగు రోజుల పండుగ అయిపోయాక నగరబాట పట్టిన తన వారి కోసం పల్లె మళ్లీ యథావిధిగా ఎదురుచూస్తూనే ఉంటుంది.

పల్లె ఎదురుచూపు..

సంక్రాంతికి మరో విశేషం ఉంది. ఆ పండుగకు సుమారు వారం రోజుల పాటు నగరాలు బోసిపోతాయి. హైదరాబాద్, బెంగళూరు, ముంబయి వంటి నగరాల్లో ట్రాఫిక్ తగ్గి పోయి రహదారులు ఖాళీగా దర్శనమిస్తాయి.ప్రవాసులతో కలుపుకొని బంధు ప్రవా హమంతా ఉరకలేసుకుంటూ పల్లె ఒడిలోకి చేరిపోతుంది. ఏడాదంతా ఉరుకులు పరుగుల జీవనంలో మమేకమైన పల్లెజనం పండుగకు వచ్చి కాస్త సేద తీరతారు. సంక్రాంతికి కళకళలాడిన పల్లెలు చుట్టాలు తిరుగుదారి పట్టడంతో ఖాళీగా దర్శనమిస్తుంటాయి. ఈ ఏడాదీ అదే కనిపించింది. కనుమ రోజు నుంచి మళ్లీ చాలా మంది పట్టణం బాటపట్టారు. ముక్కనుమ రోజు బుధవారం మరింతగా పెరిగింది. గురువారం దాదాపు గా అందరూ తమతమ ఇళ్లకు చేరిపోతారు.ఆ తరువాత నగరాల్లో హడావుడి మొదలైపోగా..పల్లెలు వెలితిగా కనిపిస్తాయి.

రైళ్లన్నీ ఫుల్..

పండుగకు ప్రధాన ప్రయాణ సాధనాలు రైళ్లు. పండుగ ప్లాన్ ఎలా ఉన్నా.. ముందుగా నెలల ముందే రానుపోను రిజర్వేషన్లు చేయించుకుంటారు. రిజర్వేషను దొరకని వాళ్లు ఏదోలా పల్లె ఒడిలో వాలిపోతారు. ఇప్పుడు ఈ ఏడాది పండుగకు వీడ్కోలు పలకడంతో రైళ్లు మరింత కిక్కిరిసి నడుస్తున్నాయి. రైల్వే ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నా రద్దీ క్లియర్ కావడం లేదు. ఇంటర్‌సిటీలు సరిపడా లేకపోవడంతో ప్రయాణపాట్లు తప్పడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు వెళ్లే రైళ్లు ఇసుకేస్తే రాలనంత ప్రయాణికులతో నడుస్తున్నాయి. రాజమండ్రి రైల్వే స్టేషను అటు కోనసీమ, ఇటు ఏజెన్సీ ప్రాంతాలకు కూడా గేట్‌వే వంటిది. సుదూర ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచి రైళ్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో సాధారణ రోజుల్లో రోజులు 10వేల మంది ప్రయాణాలు సాగిస్తే.. సంక్రాంతికి ఆ సంఖ్య రెట్టింపు అవుతుంది.

బస్సుల కిటకిట

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 17 : హైదరాబాద్, బెంగళూరు నుంచి పెద్ద పండక్కి సొంతూళ్లకు వచ్చిన జిల్లా ప్రయాణికులు తిరుగు పయనమవుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌కు ఎక్కువ మంది తిరుగు ప్రయాణాలు ప్రారంభించడంతో జిల్లా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. తిరుగుప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రారంభించింది. బుధవారం రాత్రి నుంచి ఈ స్పెషల్ సర్వీసులు మొదలయ్యాయి. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి ఏడు షెడ్యూలు బస్సులతో పాటు మరో ఏడు స్పెషల్ సర్వీసులు హైదరాబాద్ బయలుదేరి వెళ్లాయి. ఇవన్నీ ఫుల్‌రష్‌గా బయలుదేరి వెళ్లినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. వీటితో పాటు శ్రీకాకుళం, ఇచ్చాపురం ప్రాంతాల నుంచి కూడా హైదరాబాద్‌కు షెడ్యూలు బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు వయా విజయవాడ సూపర్ లగ్జరీ బస్సులకు రూ.830లు ఛార్జి చేస్తుండగా, వయా ఖమ్మం రూ.790 వసూలు చేస్తున్నారు. ఇంద్ర ఏసీ సర్వీసుకు రూ.1,050 ఛార్జిగా ఉంది. స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తుండడంతో హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులకు మంచి డిమాండ్ ఏర్పడింది. రైళ్లలో టిక్కెట్లు దొరికే పరిస్థితి లేకపోవడంతో సాధారణ, మధ్యతరగతి ప్రయాణీకులు ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం వరకూ ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపేందుకు టైం టేబుల్ సిద్ధం చేసింది. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌కు ప్రయాణీకుల రద్దీ భారీగా ఉండొచ్చనే అంచనాలతో ఆ రెండు రోజుల్లో మరిన్ని స్పెషల్ బస్సులు నడపాలని జిల్లా ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.

దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్..

ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణీకుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నాయి. ముందస్తు రిజర్వేషన్లు లేనివారు, అప్పటికప్పుడు ప్రయాణాలు సాగించాల్సిన వారు ఎక్కువ మంది ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో టిక్కెట్‌పై రూ.2 వేల నుంచి రూ.2,500 వరకూ వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండు ఏరియాలో పెద్ద సంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ ఉన్నాయి. లాలాచెరువు, కోటిపల్లి బస్టాండు వంటి చోట్ల బోర్డింగ్ పాయింట్లు ఉన్నా టిక్కెట్లు బుకింగ్ ఆఫీసులన్నీ ఇక్కడే ఉన్నాయి. పండుగ డిమాండ్ నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణీకులను దోచేస్తున్నా రవాణాశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సెలవులు పొడిగింపు.. 22 నుంచి స్కూల్స్

రాజమహేంద్రవరం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులను ప్రభుత్వం రెండు రోజులు పొడిగించిందని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకూ ఇచ్చిన సంక్రాంతి సెలవులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు 20వ తేదీ వరకూ పొడిగించారన్నారు. 21వ తేదీ ఆదివారం కావడంతో 22 నుంచి స్కూల్స్ పనిచేస్తాయన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, జడ్‌పీపీ/ఎంపీపీ, అయిడెడ్ పాఠశాలలకూ వర్తిస్తాయని..ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





అంబేడ్కర్ ఛాయాచిత్ర ప్రదర్శన తిలకిస్తున్న కలెక్టర్ తదితరులు

ఆదర్శనీయుడు అంబేడ్కర్ : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ,జనవరి 17: దేశ ప్రజలందరికి అంబేడ్కర్ ఆదర్శనీయుడని కలెక్టర్ మాధవీలత అన్నారు. సామాజిక సంకల్ప కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జీవిత విశేషాల ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను కలెక్టర్ మాధవీలత ప్రారంభించి మాట్లాడారు. అంబేడ్కర్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం ,రాజ్యాంగ రచన వివిధ ఘట్టాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు ఎంతో ఆసక్తిని కలిగించాయన్నారు. సీఎం జగన్ ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల విగ్రహం అంబేడ్కర్ సేవలకు ప్రతిరూపంగా నిర్మించి స్మృతివనాన్ని ప్రారంభించనున్నారని చెప్పారు. రెండు రోజుల పాటు అంబేడ్కర్ ఛాయా చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ అంబేడ్కర్ భారతదేశానికి మార్గనిర్దేశకులుగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్వో జి.నరసింహులు,ఆర్డీవో చైత్రవర్షిణి, కేఆర్‌సీ డిప్యూటి నాయక్ , డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ ఎం.సనత్ కుమారి, సీపీవో ఎల్ అప్పలకొండ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్ పాల్గొన్నారు.

ఊరంతా పండగ..

24 గంటల పాటు గౌరీ శంకరుల రథోత్సవం





గౌరీ శంకరుల రథోత్సవానికి హాజరైన భక్తజనం

శ్రీరంగపట్నంలో చీర, సారెను ఊరేగిస్తున్న భక్తజనం

కోరుకొండ, జనవరి 17 : ఊరంతా పండగే.. ఎక్కడెక్కడి నుంచో జనం కదిలొచ్చారు.. గౌరీశంకరుల రథోత్సవం కన్నులారా తిలకించారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో బుధవారం గౌరీశంకరుల రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రథోత్సవానికి ముందు గ్రామానికి చెందిన ఆడబడుచులు సుమారు వెయ్యి మంది అమ్మవారికి సారె, చీరలు తీసుకెళుతూ గ్రామం అంతా ఊరేగిం చారు.. ఈ సారె ఊరేగింపులో టీడీపీ నాయకులు బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి గ్రామస్తులతో కలిసి సారె ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం గౌరీచౌక్ వద్ద రథానికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవం ప్రారంభించారు.సుమారు 24 గంటలు పాటు నిర్విరామంగా రథోత్సవం సాగు తోంది. సారె తీసుకొచ్చిన 1000 మంది మహిళలకు జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. అమ్మవారికి స్వీట్లు, పండ్లు, పువ్వులు అందజేశారు.

విద్యుత్ చౌర్యం.. రూ.74 వేల జరిమానా

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: విద్యుత్ నిఘా శాఖ దాడులు ముమ్మరం చేసింది. రాజమహేంద్రవరం డీపీఈ బృందం -1 ఏడీఈ ఎల్ సతీష్ నాయక్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (యాంటి తెఫ్ట్‌స్క్వాడ్) వారి సిబ్బందితో కలిసి సీతానగరం మండలం నల్లగొండ గ్రామంలో కోళ్ళ ఫారంపై బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. అక్కడ విద్యుత్ మీటర్ బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తుండడాన్ని గుర్తించి సంబంధిత కోళ్ళఫారం యజమానికి రూ.74,345 అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం దాడులు చేస్తామన్నారు.

కోట్లు నష్టపోయాం... ఐదేళ్లు ఇబ్బందులు పడ్డాం

- అమలాపురంలో వైసీపీకి పలువురు రాజీనామా
- స్థానిక నాయకత్వం తీరుపై అసహనం


వైసీపీకి రాజీనామా చేసిన లేఖను చూపిస్తున్న వాసంశెట్టి సత్యం, కుటుంబ సభ్యులు

అమలాపురంటౌన్, జనవరి 17: 'వైసీపీలో చేరి కోట్లు నష్టపోయాం... పార్టీ కోసం ఎంతో కష్టపడ్డాం. కేసుల్లో ఇరుక్కున్నాం. మళ్లీ అదే నాయకుడిని ఎమ్మెల్యే అభ్యర్థిగా తీసుకురావడానికి యత్నిస్తున్నారు' అంటూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురం పట్టణానికి చెందిన యువ నాయకుడు వాసంశెట్టి సుభాష్ సహా పలువురు వైసీపీకి రాజీనామా చేశారు. అమలాపురంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సుభాష్, అతని తండ్రి, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా సొంత ధనాన్ని వెచ్చించి వైసీపీ అభ్యర్థుల విజయంకోసం రేయింబవళ్లు కష్టపడ్డామన్నారు. ఏడాదిన్నర కాలంగా స్థానిక నాయకత్వం కారణంగా ఎన్నో ఇబ్బందులకు గురయ్యామన్నారు. పార్టీ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే తమతో పాటు ఎందరినో అల్లర్ల కేసులో అక్రమంగా ఇరికించారన్నారు. సమస్యను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తామన్నారు. ఇబ్బంది పెట్టే నాయకులకు టిక్కెట్టు ఇవ్వవద్దని ఆ రోజే స్పష్టంగా చెప్పామని, అయినప్పటికీ ఆ అభ్యర్థికే టిక్కెట్టు కేటాయిస్తారని ప్రకటనలు వస్తున్న నేపథ్యంలో రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. స్థానిక నాయకత్వంవల్ల ఎన్నో ఇబ్బందులుపడ్డాం. అమలాపురం అల్లర్ల కేసుల్లో 325 మంది బాధితులు అనుకుంటున్నారు. వేలాది మంది ఊరు విడిచి వెళ్లిపోయారని గుర్తు చేశారు. అల్లర్ల కేసులో అన్ని సామాజికవర్గాల వారిని ఇరికించారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు దళిత సామాజిక వర్గానికి చెందిన గెద్దాడ వెంకటేశ్వరావు ఏడాదిన్నరగా బెయిల్ పొందలేక ఇంకా జైలులోనే ఉన్నాడని వివరించారు. తన తల్లి, మున్సిపల్ కౌన్సిలర్ వాసంశెట్టి కృష్ణకుమారికి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇస్తానని నమ్మించి ఆర్థికంగా ఎంతో ఖర్చు చేయించారని సుభాష్ చెప్పాడు. చివరి నిమిషంలో చైర్‌పర్సన్ పదవి ఇవ్వకపోగా అధిష్ఠానం తమకు మంచి పదవి ఇస్తానంటే మంత్రి పినిపే విశ్వరూప్‌తో పాటు వైసీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సతీష్‌కుమార్ అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే పార్టీని వీడుతున్నట్టు ప్రకటించి రాజీనామా లేఖను చూపించారు. ఏ పార్టీలో చేరేదీ త్వరలో ప్రకటిస్తామన్నారు. తాము కూడా రాజీనామా చేస్తున్నట్టు కామనగరువు ఎంపీటీసీ గుత్తుల భవాని, ఈదరపల్లి ఎంపీటీసీ అడపా సత్తిబాబు, మొగళ్ళమూరి సర్పంచ్ రాయుడు విష్ణు, దొంగ శ్రీను ప్రకటించారు.

బంగారం దొంగ అరెస్టు

పది రోజుల్లో చోరీ కేసు చేధించిన మండపేట పోలీసులు


విలేకరులతో మాట్లాడుతున్న రామచంద్రపురం డీఎస్పీ ప్రసాద్

మండపేట, జనవరి 17: 304 గ్రాముల బంగాం చోరీ కేసును మండపేట పోలీసులు పదిరోజుల్లో చేధించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడికి చెందిన గాధంశెట్టి రామచంద్రమూర్తికి చెందిన బంగారం దుకాణంలో ఈనెల 6న చోరీ జరిగింది. కేసు వివరాలను రామచంద్రపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మండపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం వెల్లడించారు. ఈఘటనలో 304 గ్రాముల బంగారం వస్తువులు ఒక వ్యక్తి అపహరించాడు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డిజిల్లా షామీర్‌పేట మండలం మాలకోపేటలో ఆనందనగర్‌కాలనీకి చెందిన 25ఏళ్ల గొట్టపు లోకేశ్ తాపి పనిచేస్తుంటాడు. ప్రస్తుతం అతడు పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం రాయిపురం గ్రామంలో ఉంటున్నాడు. అతడు ద్వారపూడిలో తాపీ మేస్త్రీగా కొంత కాలం నుంచి పనిచేస్తున్నాడు. ఈనెల ఆరో తేదీ రాత్రి ద్వారపూడికి చెందిన గాధంశెట్టి రామచంద్రమూర్తికి చెందిన బంగారం దుకాణం గోడకు కన్నం పెట్టి రూ.9లక్షల విలువైన బంగారు వస్తువులను లోకేశ్ అపహరించాడు. దుకాణం యజమాని ఫిర్యాదుతో మండపేట రూరల్ ఎస్ఐ బి.ఎస్.కృష్ణ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలతో రూరల్ సీఐ కొమ్ముల శ్రీధర్‌కుమార్ విచారణ చేపట్టారు. ఈనెల 16న ద్వారపూడి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న పాతమద్యం దుకాణం వద్ద నిందితుడు లోకేశ్‌ను పోలీసులు పట్టుకుని విచారించారు. నేరాన్ని అతడు అంగీకరించాడు. మొత్తం బంగారాన్ని రైల్లో తీసుకువెళ్తే పోలీసులు పట్టుకుంటారని, ద్వారపూడి ఓవర్ బ్రిడ్జి పిల్లర్ వద్ద కొంత బంగారాన్ని పాతి పెట్టినట్టు చెప్పాడు. కొంత బంగారాన్ని విశాఖపట్నంలో విక్రయించినట్టు అతడు చెప్పాడు. పాతిపెట్టిన రూ.7.20లక్షల విలువైన 240 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. పది రోజుల్లో కేసును చేధించిన మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, మండపేటరూరల్ పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. నిందితుడిని రాజమహేంద్రవరం కోర్టులో బుధవారం హాజరుపర్చినట్టు డీఎస్పీ తెలిపారు.

రూ.25 కోట్లు గుటుక్కు

- 4 రోజుల్లో.. ఇరగ తాగేశారు
- పండక్కి పూటుగా మద్యం
- 25వేల కేసుల మందు..
- 1.20 లక్షల బీర్లు అమ్మకం
- పందెం బరుల్లో ఏరులై పారిన మద్యం



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పండుగ నాలుగు రోజులూ కిక్ గట్టిగానే ఎక్కింది. కోడి పందెం బరులు పెద్ద సంఖ్యలో ఏర్పాటుచేయడం.. అక్కడ మందు ఏరులై పారడంతో మందుబాబులు తెగ తాగేశారు. మొహమాటాన్ని అడ్డుపెట్టి చుట్టాల గొంతుల్లోనూ పోసేశారు. బెల్టు షాపుల్లో కూడా నిరంతరం మందు అందుబాటులో ఉండడంతో అడ్డూఅదుపూ లేకుండాపోయింది. దీంతో జిల్లాలో మద్యం అమ్మకాల కిక్కు ప్రభుత్వ ఖజానాను ఉర్రూతలూగించింది. సంక్రాంతి నాలుగు రోజుల మందు అమ్మకాలపై ఉన్నతాధికారులు ముందుగానే దృష్టి సారించారు. దీంతో మద్యం ద్వారా రెండు వారాల్లో సమకూరే సొమ్ము నాలుగు రోజుల్లోనే ప్రభుత్వ గల్లాపెట్టెలోకి వచ్చేసింది. పండుగలు, పర్వదినాల్లో మద్యానికి లోటు రాకుండా చూస్తున్న ప్రభుత్వ లక్ష్యం బాగానే నెరవేరుతోంది. మరోవైపు మద్యం ధరలను ఇష్టానుసారం పెంచేస్తూ జనాల జేబులకు పాలకులు పెద్ద చిల్లులే పెడుతున్నారు. ఈ విపరీతమైన ధరలవల్ల మద్యం ప్రియులు కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. పండుగ ముందు రోజు తాజాగా 8పీఎం, మ్యాజిక్ మూమెంట్‌పై ప్రభుత్వం ధర పెంచింది. అంతకు ముందు కొన్ని బ్రాండ్లపై బాదేసింది. డిమాండ్ ఉన్న బ్రాండ్లకు ధరలు పెంచుతూ జనాలను మోసం చేస్తున్నారు. దీంతో గతంలో రూ.120కి దొరికే క్వార్టర్ ఇప్పుడు రూ.230 అయిపోయింది. బార్‌లో రూ.60-రూ.80 చెల్లించుకోవాల్సిందే. బీరు దారి మరీ దారుణం. గతంలో రూ.100కి దొరికే బీరుకు ఇప్పుడు రూ.330 వదుల్చుకోవాల్సి వస్తోంది. దీంతో మద్యం పై ప్రభుత్వ సంపాదన అమాంతం హద్దులు దాటి పరుగులు పెడుతోంది.

పండుగ తాగుడే..

తూర్పుగోదావరి 78, కోనసీమ 49, అల్లూరి సీతారామరాజు జిల్లా 18 కలుపుకొని 145 ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా ఉమ్మడి జిల్లాకు ఆదాయం సమకూరుతోంది. వీటికి 26 బార్లు అదనం. ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా 13న లి... క్కర్ 4283, బీర్లు 1099 కేసులు.. 14న 6339, 2650.. 15న 6186, 2676.. 16న 5828, 1783 కేసులు విక్రయించారు. వీటికి బార్‌లలో అమ్మకాలను కూడా కలిపితే దాదాపు 25వేల కేసుల(క్వార్టర్, హాఫ్, ఫుల్స్) లిక్కర్, 1 లక్షా 20వేల బీర్లను జనాలకు ప్రభుత్వం పట్టించేసింది. సాధారణంగా రోజుకు రూ.2 నుంచి రూ.3కోట్ల మద్యం విక్ర యాలు జరుగుతాయి. కానీ ఈ నాలుగు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణా ల్లో చూస్తే 13న రూ.3.87 కోట్లు, 14న రూ.6.21కోట్లు, 15న రూ.6.16 కోట్లు, 16న రూ.5.71కోట్ల అమ్మకాలు జరిగాయి. వీటికి బార్లలో విక్రయాలు కలుపుకొంటే మద్యం రూపేణా సుమారు రూ.25కోట్ల సొమ్మును సం క్రాంతి సందర్భంగా మందుబాబులు ప్రభుత్వానికి ముట్టజెప్పారు. ఇక సారా అమ్మకాలనూ పరిగణనలోకి తీసుకుంటే మరో రూ.2కోట్లు మద్యంప్రి యులు గుటుక్కుమనిపించారని తెలుస్తోంది.

నర్సరీని సందర్శించిన హైకోర్టు సీజే


హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు మొక్కను అందజేస్తున్న మల్లు పోలరాజు

కడియం, జనవరి 17: కడియపు లంక మల్లు పోలరాజుకు చెందిన శివాంజనేయ నర్సరీని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయనకు పోలరాజు మొక్కను అందజేశారు. సీజె నర్సరీలో వివిధ రకాల మొక్కలను తిలకించారు. బొన్సాయ్ మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంత చక్కని పచ్చని ప్రపంచాన్ని తిలకించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

అయోధ్య రాములోరికి
కల్యాణ కొబ్బరి బొండాలు


రాములోరి ఆలయ ప్రతిష్ఠకు మండపేట నుంచి తీసుకెళ్లిన బొండాలు

మండపేట, జనవరి 17: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన కేవీ రామారెడ్డి దంపతులు తయారు చేసిన అయోధ్య రాములోరి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి తీసుకెళ్లారు. మండపేటకు చెందిన రామారెడ్డి దంపతులు తెలంగాణా రాష్ట్రంలోని భద్రాచలం రాములవారి కల్యాణానికి ప్రతియేటా కల్యాణ కొబ్బరి బొండాలను తయారు చేసి స్వామివారికి అందజేస్తారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 22న అయోధ్యలో జరిగే శ్రీరాములవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి రామారెడ్డి దంపతులు మూడు కల్యాణ బొండాలను తయారు చేసి అయోధ్యలో ఉన్న శ్రీరామ మందిర ట్రస్టు నిర్వాహకులకు బుధవారం అందించామని రామారెడ్డి తెలిపారు.

లింక్ మోసం

- రూ.10 లక్షలు పోగొట్టుకున్న ఇంజనీరింగ్ విద్యార్థి

రాజమహేంద్రవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): లింక్ మోసం వలలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి పడ్డాడు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లో బొమ్మూరు మురళీకొండకు చెందిన బి.నాగ ఆదిత్య కిరణ్ బీటెక్ చదివి ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత ఏడాది డిసెంబరు 23న అతడి సెల్‌ఫోన్‌కి ఓ ఇన్‌స్టాగ్రామ్ మెస్సేజ్ వచ్చింది. రూ.2500 చెల్లించి ఆ లింక్‌లో ఉన్న టాస్క్ పూర్తిచేస్తే రెట్టింపు డబ్బు తిరిగి ఇచ్చేస్తామని సారాంశం. ఆ లింక్ క్లిక్ చేసి టాస్క్ సులభంగా ఉండడంతో పూర్తిచేయగా కిరణ్ ఖాతాలో డబ్బు జమ అయ్యింది. దీంతో మరికొంత సొమ్మును అలానే చేశాడు. ఈ క్రమంలో దఫదఫాలుగా రూ.10.30లక్షలు చెల్లించాడు. కానీ, రెట్టింపు నగదు రాలేదు. అయితే, మరో రూ.10లక్షలు జమచేస్తే రెట్టింపు నగదు మొత్తం వస్తుందని మెస్సేజ్ వచ్చింది. తాను ముందు చెల్లించిన నగదుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో కిరణ్ బొమ్మూరు పోలీసులను ఆశ్రయించాడు.

దుర్గేష్‌కు టీడీపీ నేతల పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల దుర్గేష్ భార్య ఉషారాణి మరణించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరంలోని దుర్గేష్ నివాసానికి వెళ్లి ఉషారాణి చిత్రపటానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, కోనేరు వివేక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా బుధవారం సాయంత్రం ఎంపీ రఘురామకృష్ణంరాజు.. కందుల దుర్గేష్ నివాసానికి వచ్చి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అక్కడి నుంచి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ పయనమయ్యారు.



మాజీ ఎమ్మెల్సీ దుర్గేష్‌ను పరామర్శిస్తున్న ఎంపీ రఘురామకృష్ణంరాజు, టీడీపీ నాయకులు యనమల రామకృష్ణుడు, గన్ని కృష్ణ, ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్

నాడు కళకళ.. నేడు వెలవెల!!

- సచివాలయాల ఏర్పాటుతో మీ సేవ కేంద్రాల్లో నిలిచిన సేవలు

- రౌతులపూడి మండలం పైడిపాలకు చెందిన రైతు మ్యుటేషన్ కోసం గ్రామ సచివాలయానికి వెళ్లాడు. ఫోన్ నెంబరు అనుసంధానం కాలేదని పంపేశారు. వేలిముద్ర లేదా ఓటీపీ ద్వారానైనా చేయడానికి వెసులుబాటు ఉన్నా ఆధార్ లింకు చేసుకోవాలని తెలిపారు.
- శంఖవరం మండలం మండపం గ్రామానికి చెందిన వృద్ధురాలి మరణ ధ్రువపత్రం కోసం కుటుంబసభ్యులు దరఖాస్తు చేశారు. వీటి మంజూరు ఆలస్యం కావడంతో మళ్లీ మీసేవ కేంద్రాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. దీంతో రెండుచోట్లా డబ్బులు చెల్లించాల్సి వచ్చింది.

శంఖవరం, జనవరి 17: పౌరసేవలన్నింటినీ సులభతరం చేయాలని, అవినీతి, అక్రమాలను అరికట్టి పనులు వేగవంతం చేయడానికి గత ప్రభుత్వాలు మీసేవా కేంద్రాలను ప్రారంభించాయి. అప్పటినుంచి ఆయా పరిధిలోని ప్రజలు నిర్దీత రుసుం చెల్లించి తమకు కావాల్సిన సేవలను పొందేవారు. గ్రామ సచివాయాల సేవలు మొదలైనప్పటినుంచి అన్ని సేవలను వీటికి బదిలీ చేయడంతో మీసేవా కేంద్రాల్లో సేవలు నిలిచిపోయి నిర్వాహకులు పూర్తిగా ఉపాధి కోల్పోయారు. అప్పులు చేసి లక్షలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన పరికరాలు వృథాగా ఉండిపోయాయని వారు వాపోతున్నారు. కొన్ని సేవలకు లబ్ధిదారులు మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నా అధికారులు మీసేవా ద్వారా వచ్చిన పనులు చేయకపోవడంతో ఈ కేంద్రాలు నిర్వీర్యమయ్యే స్థితిలో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1974 మీసేవా కేంద్రాలుండేవి. వీటిలో అత్యంత ప్రధానమైన మ్యూటేషన్లు, ఆధార్, రేషన్‌కార్డుల్లో చేర్పులు, సరవణలు, కొత్తవాటికి దరఖాస్తు చేసుకోవడం, అడంగల్ దిద్దుబాట్లు, ఓటరు నమోదు గుర్తింపుకార్డులు జారీ వంటి 300 రకాల సేవలు అందేవి. వీటిల్లో ప్రధాన సేవలను సచివాలయాలకు అందజేయడంతో సగానికి పైగా మూతపడ్డాయి. మరికొంతమంది వీటిని మూసివెయ్యలేక, మరొక పని చెయ్యలేక ఇబ్బందులు పడుతున్నారు. నెలకు నిర్దేశిత సంఖ్యలో సేవలు చెయ్యని మీసేవా కేంద్రాలను రద్దు చేస్తున్నారు.

30 కేంద్రాలు మూసివేత

కాకినాడ జిల్లాలో 45 మీసేవా కేంద్రాల్లో ఆధార్ సేవలు అందించేవారు. ప్రస్తుతం 15 కేంద్రాల్లో మాత్రమే ఈ సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో మిగతా 30 కేంద్రాలను నిబంధనల పేరుతో మూసివేశారు. సచివాలయాలు వచ్చిన తర్వాత మండలానికి కొన్ని సచివాలయాలు ఎంపిక చేసి అక్కడే ఆధార్ సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆటంకం లేకుండా..

మీసేవా కేంద్రాల ద్వారా సేవలు పొందేటప్పుడు వినియోగదారులకు ఆటంకం లేకుండా ప్రజలకు వీలైనప్పుడు ఏ సమయంలో వెళ్లినా సేవలు పొందే అవకాశం ఉండేది. విద్యుత్ సరఫరా లేకపోయినా, ఇంటర్‌నెట్ సరఫరాలో ఏలోపం ఉన్నా మీసేవా నిర్వాహకులే ప్రత్యామ్నాయ మార్గాల్లో సేవలు అందించేవారు. కేంద్రాల్లో అందించే సేవలను బట్టి వారికి కమీషన్ వచ్చేది. దీంతో నిరంతరాయంగా పనులు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుత సచివాలయాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. సమస్య పరిష్కారానికి లబ్ధిదారులు రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. చాలావరకూ సచివాలయ భవనాలు అందుబాటులో లేకపోవడంతో సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని పలువురు చెప్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం : మీ సేవ నిర్వాహకుడు

మీ సేవా కేంద్రం మీద ఆశలు పెట్టుకుని కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి పరికరాలను కొనుగోలు చేశాం. ఇప్పుడు నెలకి రూ.వెయ్యి కమీషను రావడం గగనంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది. దీనిద్వారా వచ్చే ఆదాయంతో బతకలేం. వేరే పని చెయ్యలేం. ప్రభుత్వం మీసేవా కేంద్రాలకు పునర్ వైభవం తీసుకురావాలి.

జీఎన్‌ఎం ప్రాక్టికల్స్ ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ), జనవరి 17: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) విద్యార్థులకు కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్లో ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఉన్న 31 నర్సింగ్ స్కూళ్లకు సంబంధించిన 3,500 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు చీఫ్ ఎగ్జామినర్‌గా సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ పుష్కరరావ్‌ను నియమించగా, చీఫ్ ఇన్విజిలేటర్‌గా ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆషాదేవిని నియమించారు. ఐదుగురు ప్రభుత్వ, 11 మంది ప్రైవేట్ నర్సింగ్ స్కూళ్ల సిబ్బంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

20 నుంచి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు

కాకినాడ అర్బన్, జనవరి 17: ఈనెల 20, 21వ తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలు పిఠాపురం రాజీవ్‌గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 150మంది క్రీడాకారులు హాజరవుతారని, జిల్లాస్థాయి ఎంపికలు పిఠాపురంలో గురువారం నిర్వహిస్తారని అన్నారు. 20ఏళ్లపైన వయస్సుగల అర్హులు పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 9490645859 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా
షర్మిళారెడ్డి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న షర్మిళారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా షర్మిళారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత రాజమహేంద్రవరం హైటెక్ బస్టాండ్ సెంటర్‌లోని మేడపాటి సీతారామిరెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అక్కడి నుంచి భారీగా వాహనాలతో విజయవాడ తరలివెళ్లి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె రుడా చైర్‌పర్సన్‌గా పనిచేశారు. రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పేరి కామేశ్వరరావు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్, పెద్దాపురం నేత దవులూరి దొరబాబు తదితరులు అభినందనలు తెలిపారు. ఆమె వెంట భర్త అనిల్ రెడ్డి ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

కాకినాడ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. పిఠాపురం రూరల్ మండలం చిత్రాడ మంచినీటి చెరువువద్ద సెల్ఫీతీసుకుంటూ ప్రమాదవశాత్తూ చెరువులోపడి యువకుడు మృతి చెందాడు. అలాగే పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. కోటనందూరు మండలం కాకరపల్లి శివారు నల్లచెరువు మలుపువద్ద ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి దుర్మరణం చెందాడు. అలాగే సామర్లకోట మున్సిపాల్టీలో అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడు పెద్దాపురం రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరప మండలం వేములవాడకు చెందిన ఓ వ్యక్తి పాముకాటుకుగురై జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చెరువులో పడి వలంటీర్ మృతి

- సెల్ఫీ తీసుకుంటూ జారిపడ్డ యువకులు


మృతుడు వలంటీరు సందీప్

పిఠాపురం రూరల్, జనవరి 17: సెల్ఫీ తీసుకునే సమయంలో చెరువుగట్టుపై నుంచి పడి ఇద్దరు యువకులు గల్లంతు కాగా ఒకరు మరణించగా మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. సామర్లకోట మండలం చంద్రంపాలెం గ్రామానికి చెందిన నలుగురు యువకులు పిఠాపురం మండలం చిత్రాడలో క్రికెట్ ఆడేందుకు మంగళవారం వచ్చారు. సాయంత్రం సమయంలో గ్రామ శివారులోని సమ్మర్ స్టోరేజీ వాటర్ ట్యాంకు(మంచినీటి చెరువు) గట్టుపై సరదాగా నడుస్తూ సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ సమయంలో ఇద్దరు యువకులు గట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ చెరువులోకి జారిపడ్డారు. ఇందులో చంద్రపాలెం సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్న గుడాల సందీప్ గల్లంతు కాగా మరొక యువకుడు సురక్షితంగా బయటపడ్డాడు. వెంటనే యువకులంతా కలిసి సందీప్ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే రాత్రి కావడంతో మృతదేహాన్ని వెలికితీయడం సాధ్యం కాలేదు. బుధవారం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సందీప్‌కు తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. ఆడుకోవడానికి వెళ్లి సందీప్ మృత్యువాత పడటంతో అతని కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


పిఠాపురం రైల్వేస్టేషన్‌కు సమీపంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పిఠాపురం: పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. విజయవాడ నుంచి విశాఖ వెళ్లే మార్గంలో మొదటి రైల్వే ప్లాట్‌ఫారానికి 100 అడుగుల దూరంలో ఇతని మృతదేహాన్ని రైల్వేపోలీసులు గుర్తించారు. రైలు నుంచి జారిపడటం లేదా ఢీకొని మరణించి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇతని వయస్సు 35-40 వయస్సు ఉంటుందని, లేత నీలం రంగు ఫుల్‌హాండ్స్ షర్ట్, నీలం రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. కుడి చేతిపై కన్నమ్మ పేరుతో పచ్చబొట్టు ఉందని చెప్పారు. ఇతని ఎత్తు సుమారు 5.6 అడుగులు ఉంటుందని, చామనచాయ రంగులో ఉన్నట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిసిన వారు సామర్లకోట రైల్వేపోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ బి.లోవరాజు కోరారు. ఇతని మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

కోటనందూరు: కాకినాడజిల్లా కోటనందూరు మండలం కాకరపల్లి శివారు నల్లచెరువు మలుపు వద్ద ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకరపల్లి నుంచి అల్లిపూడి వైపు వెళ్తున్న సమయంలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. నాతవరం మండలం గుమ్మిడికొండ గ్రామానికి చెందిన కోడూరి ఆచారి(39) తలకు బలమైన గాయం కావడంతో తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎంబీ పట్నంకు చెందిన నాకిరెడ్డి సత్యవతి, నాకిరెడ్డి చిట్టెమ్మలకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శంకరరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని తాపీమేస్త్రి మృతి



ప్రత్తిపాడు, జనవరి17: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టుసెంటర్ జాతీయ రహదారిపై తాపీ మేస్త్రి మృతి చెందాడు. మండలంలో శరభవరానికి చెందిన ఉలిసి శ్రీను(40)మోటర్‌బైక్‌పై ప్రత్తిపాడు నుంచి శరభవరం వెళుతుండగా ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద రహదారిని క్రాస్ చేస్తుండగా రాజమండ్రి నుంచి ఇచ్చాపురం వెళుతున్న హైవేలో ఢీ కొంది. ఈ ప్రమాదంతో తాపీ మేస్త్రీ ని ఢీకొంది. ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. తాపీ పనులు ముగించుకుని వస్తున్నశ్రీను రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటం పట్ల అతని కుటుంబం సంఘటానా స్థలానికి వచ్చి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని పారిశుధ్య కార్మికుడి మృతి



సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపాల్టీలో అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మిర్యాల రాజు(35) అనే కార్మికుడిని పెద్దాపురం రోడ్డులో మోర్ మార్కెట్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి చేరగా ఆసుపత్రికి తరలించగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసు కుంది. రోజూలాగే మున్సిపల్ విధులకు మస్టర్ పనికి వెళుతు ండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సహచర పారిశుధ్య కార్మికులు అతడిని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నప్పటికీ రాజు మృతి చెందాడు. సామర్లకోట మండలం భీమవరపుపేటకు చెందిన రాజుకు భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు. రాజు మృతితో కుటుంబజీవనాధారం కోల్పోయిన రాజు కుటుంబసభ్యుల రోదనలతో భీమవరపుపేటలో విషాధచాయలు అలుముకున్నాయి. సామర్లకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నా రు.

పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి


వాసంశెట్టి సూరిబాబు మృతదేహం

కాకినాడ క్రైం, జనవరి 17: పాము కాటుకు గురైన ఓ వ్యవసాయ కూలీ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కొద్దిసేపటికే మృతి చెందాడు. కరప మండలం వేములవాడకు చెందిన వాసంశెట్టి సూరిబాబు(37) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున తన ఇంటి సమీపంలోని దూళ్ల మకాం వద్దకు వెళ్లాడు. అక్కడ చీకటిలో సూరిబాబును గుర్తు తెలియని విష సర్పం కాటేసింది. ఆ బాధతో మూలుగుతూ ఇంటికి వచ్చి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో కుటుంబీకులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతున్న కొద్దిసేపటికే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సూరిబాబు మృతి చెందాడు. మృతుడికి భార్య కృష్ణవేణి, కుమార్తెలు తొమ్మిదేళ్ల రేణుక, ఏడేళ్ల సౌమ్య ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన భర్త అకాలంగా మృత్యువాత పడడంతో భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

భార్యను వేధించిన కేసులో
భర్తకు ఏడాది జైలు

కాకినాడ క్రైం, జనవరి 17: భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి తీర్పునిచ్చారు. కాకినాడకు చెందిన సురభి శ్రీరామం కుమార్తె సురభి విజయలక్ష్మిని హైదరాబాద్‌కు చెందిన పోతుకుచ్చి హనుమ శ్రీనివాస్‌కు ఇచ్చి 2011లో కాకినాడలో వివాహం చేశారు. హైదరాబాద్‌లో భర్తతో కాపురం చేస్తున్న సమయంలో అదనపు కట్నం కోసం విజయలక్ష్మిని భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. అదనపు కట్నం తెస్తేనే తిరిగి కాపురానికి తీసు కెళ్తానని చెప్పి పుట్టింట్లో వదిలేశాడు. దీంతో 2012లో విజయలక్ష్మి కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ (ప్రస్తుతం రామచంద్రపురం సీఐ) వి.దుర్గారావు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్త హనుమ శ్రీనివాస్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ బుధవారం కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి తీర్పు నిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ గోసాల కమలాకుమారి వాదనలు వినిపించారు.

ట్రావెల్ బస్సు దగ్ధం


దగ్ధమైన బస్సు

ప్రత్తిపాడు, జనవరి 17: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జోడిగంటల వంతెన సమీపంలో ట్రావెల్ బస్సు దగ్ధమైంది. రాజమండ్రి నుంచి విశాఖపట్నం వెళు తున్న ట్రావెల్ బస్సుకు మంటలు వ్యాపించి దగ్ధమైంది. ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో సురక్షితంగా వెళ్లిపోయారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమై ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం

అంగన్‌వాడీలను రోడ్డున పడేసిన ఘనత జగన్‌దే

● గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు



అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న రామరావు

రాజవొమ్మంగి జనవరి 17: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె రాజవొమ్మంగి మండలంలో 37వ రోజు కొనసాగింది. అంగన్‌వాడీ వర్కర్ల నిరసన దీక్షకు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు మద్దతు తెలిపారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు మాట్లాడుతూ పండగ పూట అంగన్‌వాడీ వర్కర్లను రోడ్డున పడేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిది అని, తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించమని అడిగినా.. ప్రభుత్వం స్పందించకపోగా బెదిరింపుధోరణి సరికాదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి త్వరలో మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు, కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాధం ఉన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



రాజవొమ్మంగి ప్రధాన రహదారిలో బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

రాజవొమ్మంగి జనవరి 17: పూటగడవడానికి వలసపోయిన ప్రజలు సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంత గ్రామాలకు వచ్చి బంధువులతో మూడు రోజులపాటు సంతోషంగా గడిపారు. బుధవారం నుంచి తమ పనులకు ప్రయాణమయ్యారు. రాజవొమ్మంగి ప్రధాన రహదారి బుధవారం ప్రయాణికులతో కిక్కిరిసింది. గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో ఉండడంతో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. బస్సు వచ్చే వరకు కూర్చునేందుకు నీడ లేదు. మండుటెండలో రోడ్డుపైనే కూర్చున్నారు. ఆర్టీసీ బస్సులు సమయానికి రాక, వచ్చిన బస్సులు ఖాళీ లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు వాపోయారు.

పేద గిరిజనులకు రగ్గుల పంపిణీ



గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న ఆంధ్రా వనవాసి కళ్యాణ ఆశ్రమ సేవాసంస్థ సభ్యులు

వై.రామవరం, జనవరి 17: మండలంలో లోతట్టు గ్రామాల గిరిజనులకు ఆంధ్రా వనవాసీ కళ్యాణ ఆశ్రమ సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. సేవాసంస్థ అధ్యక్షుడు బొగ్గుల కాటంరెడ్డి ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పైడిపుట్ట, పసిరిగిన్ని, చేమగడ్డ, చీడిపాకలు గ్రామాలలో సుమారు 60గిరిజన కుటుంబాలకు రగ్గులను అందజేశారు. గొరమంద అటవీప్రాంతంలో ఉన్న చీడిపాకలు గ్రామంలో 20 మంది కొండరెడ్డి పిల్లలు చదువుకొనేందుకు ఉపాధ్యాయులను నియమించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు పల్లాల వెంకటరమణారెడ్డి వెలుగూరి ప్రభాకర్‌రెడ్డి, బొగ్గుల విశ్వనాదం, మడకం లక్ష్మణ్, వెలుగూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు





మోతుగూడెం, జనవరి17: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో పొల్లూరు గ్రామంలో పేపకలా శ్రీను ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించార. ముఖ్యఅతిథిగా సర్పంచ్ ఆకేటి సీత విచ్చేసి ప్రథమస్థానంలో నిలిచిన ఆశదుర్గ, ద్వితీయ స్థానం సాధించిన ఈశ్వర్ మీనా, మూడో స్థానం సాధించిన నాగమణిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొల్లూరు కమిటీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిడదవోలులో నంగాలమ్మ సంబరాలు

నిడదవోలు, జనవరి 17: నిడదవోలు గ్రామ దేవత నంగాలమ్మ తల్లి సంబరాలు ఘనంగా నిర్వహిస్తారు. బుధవారం అమ్మవారి ఊరేగింపు స్థానిక యాదవుల వీధికి విచ్చేయగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, యాదవ సంఘం అధ్యక్షుడు గంగుల గోపీయాదవ్, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, బిర్రే పార్వతి, మాజీ కౌన్సిలర్ రాజా రామ్మోహన్‌రయ్, యాదవ సంఘం నాయకులు స్వాగతం పలికి హారతులిచ్చి పూజలు చేశారు.

భావనాబుషి మహోత్సవాలు

తాళ్లపూడి, జనవరి 17: తాళ్లపూడిలో పద్మశాలీయుల ఆరాధ్యదైవం భద్రావతి స మేత భావనాబుషి మహోత్సవాలు బుధవారం ముగిసాయి. వారం రోజులుగా పుష్కరవీధిలోని ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉత్సవ ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలు, కోయ డాన్సులు, వేషధారణలు, గరగ నృత్యాలతో సాగిన ఈఊరేగింపులో శూల ధారణ అందరినీ ఆకట్టుకుంది. గ్రామంలోని ఆడపడుచుల రాకతో సందడి నెలకొంది. ఉత్సవ కమిటీ సభ్యులు కోడాటి సత్యనారా యణ, ఉడతా వీరేంద్ర కుమార్, చిట్టిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు, జనవరి 17: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కొవ్వూరుకు చెందిన అన్నమరెడ్డి విశ్వనాథం ఈ నెల 16వ తేదీ సాయంత్రం గామన్ వంతెన టోల్ ప్లాజా వద్ద బైక్‌తో రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది విశ్వనాథం తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు, జనవరి 17: రోగులు, బాలింతలు, గర్భిణులకు క్రమం తప్ప కుండా రోటరీ పౌష్టికాహారం అందిస్తోందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనే యులు అన్నారు. బుధవారం నిడదవోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బల గం స్వర్ణలత ఆర్థిక సహకారంతో 51 మందికి పౌష్టికాహారం పంపిణీ చేశారు.

అంగన్‌వాడీల సంజాయిషీకి..షాక్!



ఐసీడీఎస్ కార్యాలయ గోడకు నోటీసులు అతికిస్తున్న అంగన్‌వాడీలు

- తీసుకునేందుకు నిరాకరించిన అధికారులు
- సంజాయిషి లేఖలను సీడీపీవో కార్యాలయ గోడలకు అంటించిన అంగన్‌వాడీలు
- 37వ రోజు కొనసాగిన నిరవధిక సమ్మె

రాజానగరం, జనవరి 17: హామీల అమలు కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై అంగన్‌వాడీలు తీవ్రంగా మండిపడుతున్నారు. తమపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేబీ రాణి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆమరణ నిరవధిక దీక్షలు ప్రారంభమయ్యాయని, ఇకమీదట జిల్లాలో చేపడతామని ఈసందర్భంగా హెచ్చరించారు. నిరవధిక సమ్మె బుధవారం 37వ రోజుకు చేరుకుందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను నిర్బంధించాలని చూస్తోందని, అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వ, అధికారుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం రిజిష్టర్ పోస్టులో పంపిన షోకాజ్ నోటీసులకు బదులిచ్చేందుకు బుధవారం రాజానగరం సీడీపీవో కార్యాలయానికి వెళ్లి సంజాయిషీ తీసుకోవాలని కోరగా అధికారులు నిరాకరించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంబంధిత అధికారులు సంజాయిషీ నోటీసులు తీసుకుంటున్నప్పటికి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం తీసుకోబోమంటూ భిన్నంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. అయితే తమ ఇళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులను ఏవిధంగా అంటించారో అదేవిధంగా స్థానిక సీడీపీవో కార్యాలయంలో గోడలకు తమ సంజాయిషి పత్రాలను అంటించామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు ఎం.మార్తమ్మ, సుజాత, గంగ, వైశాలి, చంద్రావతి, వై.సుజాత, విజయ తదితరులు పాల్గొన్నారు.

'షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: వైఎస్ షర్మిలను పీసీసీ అధ్యక్షురాలిగా కొత్తగా నియమించడంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి విజయకుమార్ అన్నారు.ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును సీడబ్ల్యుసీ ప్రత్యేక సభ్యుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బిక్కవోలు, జనవరి 17: కొంకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1991 నుంచి 1996 వరకూ చదివిన విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వీరు తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన గురువులను సత్కరించారు. వారి ఉన్నతికి కృషి చేసిన దివంగత సూర్ల మాష్టారు, కుక్కల సూర్యనారాయణలను స్మరించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



కొంకుదురు జడ్పీ హైస్కూల్లో 1991 నుంచి 1996 వరకూ చదివిన విద్యార్థులు

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో..



ఆర్ట్స్ కళాశాల 2010-13 బ్యాచ్ ఎంపీసీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 17: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల 2010-13 బ్యాచ్‌కు చెందిన ఎంపీసీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన కూర్మయ్య, కామేశ్వరశర్మ, ప్రభాకరరావు, కృష్ణకుమార్, సర్వేశ్వరరావు, కామేశ్వరరావు, ఈసుబ్ భాషా, సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, ఏలేశ్వరం కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీతతోపాటు పూర్వ విద్యార్థులైన సహాయ ఆచార్యుడు జాన సురేష్, లెక్చరర్ వీరబాబు, డిప్యూటీ జైలర్ రామకృష్ణ, వీఆర్వో శ్రీనివాసు, విలేజ్ సెక్రటరీ ప్రభాకర్, పేపర్‌మిల్లు క్వాలిటీ అనలైజర్ వరప్రసాద్, ప్రత్యూష, కౌసల్య పాల్గొన్నారు.

నేడు రాజమహేంద్రవరంలో మెగా వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం రాజమహేంద్రవరంలో భారీ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తెలిపారు. కంబాలచెరువు వద్ద గల ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జీకే స్పందన చారిటబుల్ ట్రస్ట్, ఎన్టీఆర్ ట్రస్ట్, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీహాస్పటల్ సంయుక్త నిర్వహణలో గురువారం ఉదయం 10 గంటల నుంచి శ్రీరామ్‌నగర్‌లోని తన నివాసం వద్ద ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. చంద్రబాబుకు 17ఎ అప్లికేబుల్ అవుతుందా లేదా అనేది సుప్రీంకోర్టు నిర్ణయిస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య జక్కంపూడి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాపవరంలో పాసాలమ్మ జాతర

కోరుకొండ, జనవరి 17: మండలంలోని కాపవరం గ్రామదేవత పాసాలమ్మ జాతర మూడు రోజులపాటు వైభవంగా జరిగింది. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాజుల రాము, ఎంపీటీసీ కాలచర్ల నాగు, తెలగంశెట్టి వెంకటలక్ష్మి, కాలచర్ల శివాజీ, కాలచర్ల వెంకటేశ్వరరావు, కాలచర్ల చిన్నారావు పాల్గొన్నారు.

రేపు శ్రీరామ విజయయాత్ర



శ్రీరామ విజయయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యగోపినాథ్ దాస్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 17: అయోధ్య శ్రీరామ మందిరంలో ఈనెల 22న ప్రాణప్రతిష్ట జరుగుతున్నందున రాజమహేంద్రవరంలో ఈ నెల 19న శ్రీరామ విజయయాత్ర నిర్వహిస్తున్నామని బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ సత్యగోపినాథ్ దాస్ ప్రభూజీ తెలిపారు. రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 19న మధ్యా హ్నం 2 గంటలకు రాజమహేంద్రవరం ఏవి అప్పారావు రోడ్డు రామాలయం సెంటర్ నుంచి శ్రీరామ విజయ యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలంతా పాల్గొనాలని యాత్ర కన్వీనర్ తోట సుబ్బారావు కోరారు. యాత్ర సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందని 10 వాహనాలు, ఐదు వేల మంది భక్తజనం పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో రాము ,మురారి హరిదాసు, సదా రామదాసు, సుబ్రహ్మణ్యం ,హరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం

కడియం, జనవరి 17: మురమండ ముత్యాలమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. తీర్థం సందర్భంగా మురమండతోపాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు గుణ్ణం బాలకృష్ణ, ప్రత్తిపాటి వేంకటరామయ్యచౌదరి, గుణ్ణం సతీష్, ఎన్‌వీవీ సత్యనారాయణ, గుణ్ణం పెదబ్రహ్మాజీరావు, పాతూరి గనిరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నారా లోకేశ్‌ను కలిసిన మద్దిపాటి

గోపాలపురం, జనవరి 17: ఉండవల్లిలోని నారా లోకేశ్ నివాసంలో ఆయనను బుధవారం కలిసి పద్మావతి, అలివేలుమంగ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేసినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. ఈ సందర్భంగా నల్లజర్ల మండలంలో ఈ నెల 27న జరిగే రాకదలిరా బహిరంగ సభ నిర్వహణ, సభా ప్రాంగణం ఏర్పాట్లు, జనసమీకరణ తదితర అంశాలపై సుమారు గంటసేపు చర్చించినట్టు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత లాలాచెరువు జట్టు

గోపాలపురం, జనవరి 17: క్రీడాకారులు గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో వైఎస్సార్ ఆర్మీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. 37 టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నీలో రాజమహేంద్రవరం లాలాచెరువు టీమ్ విజేతగా నిలిచింది. విజేత జట్టుతోపాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు, క్రీడాకారులకు ఎమ్మెల్యే తలారి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ పైడి శిరీష, స్పోర్ట్స్ డైరెక్టర్ వరలక్ష్మి, జిజ్జువరపు అన్నవరం, ఉపసర్పంచ్ ముల్లంగి శ్యామ్, క్రీడాకారులు పాల్గొన్నారు.స

రఘురామకృష్ణంరాజును కలిసిన టీడీపీ నాయకులు

నిడదవోలు, జ నవరి 17: నిడద వోలులోని నెహ్రూ బొమ్మ సెంటరులో బుధవారం ఎంపీ రఘురామకృష్ణం రాజును స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగకు భీమవరం వచ్చిన ఆయన తిరిగి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు వెళుతున్న సందర్భంగా నిడదవోలులో టీడీపీ నాయకులు కలసి శాలువా కప్పారు.

అభయాంజనేయస్వామి ఉత్సవాలు

అనపర్తి, జనవరి 17: మండలంలోని కుతుకులూరులో అభయాంజనేయ స్వామి ఉత్సవాలు మంగళవారం రాత్రి, బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు, వైసీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి నల్లమిల్లి దుర్గాప్రసాదరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతరలో ఏర్పాటు చేసిన విద్యుదీపాలంకరణ, బాణసంచా కాల్పులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

వైభవంగా కంటాలమ్మ జాతర



కోరుకొండలో కంటాలమ్మను ఊరేగిస్తున్న భక్తులు

కోరుకొండ, జనవరి17: కోరుకొండ గ్రామదేవత కంటాలమ్మ జాతర ఉత్సవాలు నాలుగు రోజులు పాటు వైభవంగా జరిగాయి. బుధవారం ముగింపు సందర్భంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఎస్సీ, బీసీ 9సంఘాల పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు గరగ శ్రీధర్‌బాబు, కర్రి వీరగణేష్, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, ఎంపీటీసీ కాళ్ళ వీరబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త మాతా సీతారాముడు ఆధ్వర్యంలో గ్రామోత్సవం కన్నుల పండగా జరిగింది. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన

సీతానగరం, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీరుకొండ వీరన్నచౌదరి వివరించారు. సీతానగరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నా వాటిపై ప్రజలకు అవగాహన ఉండడం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోండ్రపు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పాలచర్ల- గాడాలలో హైనా హల్‌చల్

రాజానగరం, జనవరి 17: పాలచర్ల-గాడాల పరిసర అటవీ ప్రాంతాల్లో హైనా (అడవి జంతువు) సంచరిస్తున్నట్టు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని సంచారంతో ఆయా గ్రామాల ప్రజలు, ప్రధానంగా చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైనా సంచార విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. దీనిపై అటవీశాఖాధికారులను సంప్రదించగా ఈ విషయం ఇప్పటికే తమ దృష్టికి వచ్చిందని, అటవీ సిబ్బందిని అప్రమత్తం చేశామని, ఆయా గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో సిబ్బందిని, స్థానికులను, రైతులను విచారిస్తున్నామన్నారు. హైనా కనిపిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని అటవీశాఖ కోరినట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

కొవ్వూరు, జనవరి 17: రోడ్డు భద్రతా మాసోత్సవాలను బుధవారం కొవ్వూరు డిపో మేనేజరు వైవీవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఏటా జనవరిలో చేపట్టే రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డీఎం మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వారితో కండక్టర్లు కూడా అండగా ఉండి సహకరించాలన్నారు. అలాగే గేరేజ్ సిబ్బంది మెరుగైన టూల్స్, మెయింటెనెన్స్ ద్వారా బస్సులకు బ్రేక్‌డౌన్‌లు లేకుండా ప్రయాణికులు ఇబ్బం దులు పడకుండా చూడాలని కోరారు. డ్రైవర్లకు భద్రతా దృష్ట్యా ఏటా మెడికల్ చెకప్ చేయిస్తున్నామన్నారు. ప్రయాణికుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కలిగించడానికి రోడ్డు సేఫ్టీ అవగాహన సదస్సులు, రక్తదాన శిబిరాలు ఫిబ్రవరి 14వరకూ నిర్వహిస్తామన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం



కొవ్వూరు, జ నవరి 17: గోపాలపురం, కొవ్వూరు నియోజక వర్గాల కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లాబేగ్, ఏఐసీసీ సభ్యుడు అమర్జహా బేగ్‌మొహమ్మద్‌ల ఆధ్వర్యంలో జరిగింది. వైఎస్ షర్మిళ ఏపీసీసీ అధ్యక్ష పదవి పొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన గునుకురి సుశాంత్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జ్యేష్ఠ సతీష్, వేగా రామకృష్ణ, సాకే పుల్లారావు, మెట్ల సుబ్బారావు, ఫ్రాన్సిస్, కొడమంచిలి చంద్రశేఖర్, జి.బుచ్చిబాబు పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ జాతరలో భక్తుల నిలువు దోపిడీ

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 17: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ భక్తులను నిలువు దోపిడీ చేస్తోందని, పొట్టకూటి కోసం వచ్చిన చిరువ్యాపారుల నుంచి రూ.2 వేలు వసూలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నడుస్తోందని, ఆలయాల వద్ద సత్సంగా లను విడదీసి రాజకీయాలు చేస్తున్నారని, అమ్మవారికి ఏటా వచ్చే చందాల లెక్కలు చెప్పడం లేదని పేర్కొన్నారు. చిరు దుకాణాల వద్ద వసూలు చేస్తున్న సొమ్ములకు రశీదులు ఇవ్వడం లేదని ఈ సొమ్మంతా ఎక్కడికి వెడుతుందో కమిటీ సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, బాసి, కర్రి వెంకటరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, నూతిక బాబూరావు, మామిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయానికి విరాళం అందజేత

కడియం, జనవరి 17: మండలంలోని మురమండలో శ్రీదుర్గాదేవికి గ్రామానికి చెందిన బొబ్బా విశాలాక్షి, ఆమె కుమార్తెలు రమ్యభాను, విహారిక, సురేఖ, మనుమరాలు కృతికతో కలిసి రూ.25 వేలు అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వీరబాబుకు అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

మార్గానిని కలిసిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

కడియం, జనవరి 17: పండుగ సందర్భంగా కడియపులంకలో టీడీపీ రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణను బుధవారం మండలంలోని పార్టీ ఎస్సీసెల్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జల్లి కృపారావు, కాయల సత్యనారాయణ, కనికెళ్ల బుల్లియ్య, విప్పర్తి శ్రీను, మండపల్లి రత్నరాజు, చింతపర్తి నాగేశ్వరరావు, ప్రత్తి ప్రకాష్ పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిదండ్రులిచ్చే విలువైన ఆస్తి విద్యే

తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 17: పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే విలువైన ఆస్తి విద్య మాత్రమేనని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ఆవరణలో బుధవారం 5,6,7,8,910వ తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు ఐఐటీ, మెడికల్, ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు జరిగింది. తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలందరూ ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్‌కి బాగా అలవాటుపడి చదువు మీద శ్రద్ధ తగ్గిపోతుందన్నారు. పిల్లలను వాటికి దూరంగా ఉంచాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని విద్యా సంస్థల డైరక్టర్ నున్న సరోజినీదేవి అన్నారు. ఈ సదస్సులో విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ రామగుర్రెడ్డికి సత్కారం



రామగుర్రెడ్డి లలితారాణి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

అనపర్తి, జనవరి 17: అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్, మధుమేహ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ తాడి రామగుర్రెడ్డి లలితారాణి దంపతు లకు బుధవారం పొలమూరులో శారదా కళానికేతన్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో రామగుర్రెడ్డి దంపతులను ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు, నేత్ర వైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణ రెడ్డి మస్తానమ్మ దంపతుల ఘనంగా సత్కరించారు. సాధారణ కుటుంబంలో జన్మించి స్వశక్తితో వైద్య విద్యనభ్యసించి పొలమూరుకు వన్నె తెచ్చిన గుర్రెడ్డి ప్రతిఒక్కరికీ ఆదర్శమని పలువురు అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు సత్తి రామారెడ్డి, మేడపాటి గంగిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి కోనాల సత్తిరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	సైంధవ్
సూర్యామినీ	నా సామి రంగ
సూర్యాప్యాలస్	గుంటూరు కారం
స్వామి	గుంటూరు కారం
శివజ్యోతి	సైంధవ్
అనుశ్రీ(సాయికృష్ణ)	హనుమాన్
రాజా	హనుమాన్
అశోక	సలార్
ఊర్వశి	హనుమాన్
రంభ	నా సామి రంగ
మేనక	హనుమాన్
అప్సర	గుంటూరు కారం
కుమారి	హనుమాన్
వీఎస్ మహల్ (నామవరం)	హనుమాన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	నా సామి రంగ
వెంకటసూర్య(కడియం)	హనుమాన్
సత్యగౌరి (అనపర్తి)	గుంటూరు కారం
సూర్యశ్రీ (అనపర్తి)	గుంటూరు కారం
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	గుంటూరు కారం
రామకృష్ణ(కోరుకొండ)	సైంధవ్
గీతాసినిమాస్ (సీతానగరం)	సైంధవ్
శ్రీనివాస (గోకవరం)	సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	గుంటూరు కారం
లలితామహల్(రంపచోడవరం)	సైంధవ్
నవయుగ(చింతూరు)	హనుమాన్





సడలని పోరు : రాజమహేంద్రవరంలో సంజాయిషి పత్రాలు గోడలపై అతికిస్తున్న అంగన్‌వాడీలు

4 రోజులు..రూ.5.52 లక్షలు



నిడదవోలు, జనవరి 17 : తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూకట్టారు. దీంతో 4 రోజులు ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో భోగి, సంక్రాంతి, కనుమ, ముక్క నుమ నాలుగు రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున మొక్కుబడులు చెల్లించుకున్నారు. 4 రోజులు అమ్మవారికి మొత్తం రూ.5,52,351లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా షర్మిళారెడ్డి 6



ఇదేం ప్రభుత్వం : కొవ్వూరులో సంజాయిషి పత్రాలతో అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీల ఆగ్రహం

సంజాయిషీకి.. షాక్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 17 : రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వానికి పట్టదా అని అంగన్‌వాడీలు మండిపడ్డారు. గత 37 రోజులుగా ఆందోళన చేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు బుధవారం రాజమహేంద్రవరం, కొవ్వూరులో ఐసీడీఎస్ కార్యాలయాలకు వెళితే సీడీపీవో కార్యాలయం సిబ్బంది రిప్లయ్ తీసుకోవడానికి నిరాకరించారు. దీనిపై అంగన్‌వాడీలు మండిపడ్డారు. మా ఓట్లతో గెలిచి మాపై పెత్తనమేంటని.. సీఎం జగన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎంత సేపటికి కార్యాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రాజమహేంద్రవరంలో ఐసీడీఎస్ కార్యాలయం గోడలకు సమాధాన పత్రాలు అతికించారు. షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ వేచి ఉన్నా సిబ్బంది స్పందించకపోవడంతో షోకాజ్‌లకు రిప్లయ్‌లను కార్యాలయం గోడలకు అతికించి వెనుదిరిగామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాజమహేంద్రవరం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు శారద, సునీత తెలిపారు. దీనిపై సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో నోటీసులపై రిప్లయ్‌లు తీసుకుంటుంటే ఇక్కడ మాత్రం ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, జిల్లా కమిటీ సభ్యుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు..రూటు!

- రానుంది ఓట్ల పండగ
- త్వరలో ఎన్నికల నోటిఫికేషన్
- సిద్ధమవుతున్న అభ్యర్థులు
- త్వరలో టీడీపీ తొలిజాబితా
- అదే బాటలో జనసేన
- నాలుగో జాబితాకు వైసీపీ సన్నద్ధం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగ వెళ్లిపోయింది. ఓట్ల పండగ రానుంది. ఇక సందడంతా ఎన్నికల మీదే. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. గెలుపు గుర్రాలను ఎంపిక చేసుకునే ప్రక్రియలో నిమగ్నమయ్యాయి. త్వరలోనే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. తెలుగుదేశం- జనసేన పొత్తువల్ల ఆ పార్టీ నుంచి టికెట్లు ఆశించే వారి సంఖ్య బాగా పెరిగింది. సంక్రాంతి పండుగ తర్వాత టీడీపీ అభ్యర్థుల తొలిజాబితా వస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. జనసేన అభ్యర్థుల పేర్లు త్వరలోనే వెల్లడిస్తారు. జిల్లాలో ఒక లోక్‌సభ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో టీడీపీకి రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ దక్కాయి. టీడీపీ అధినేత సిట్టింగ్‌లకు మళ్లీ టికెట్లు ఇస్తామని గతంలో చేసిన ప్రకటన వల్ల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అర్బన్ నుంచి ఆదిరెడ్డి కుటుంబం హుషారుగా పార్టీ పనిలో నిమగ్నమయ్యాయి. అనపర్తి, రాజానగరం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు స్థానాల్లో గత ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందింది. అందులో ఇప్పటికే గోపాలపురం ఇన్‌చార్జిగా మద్దిపాటి వెంకట్రాజు, రాజానగరం ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణను నియమించారు. అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పార్టీ కోసం పనిచేస్తున్నారు. నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సీనియర్ నేత కుందుల సత్యనారాయణ టికెట్ ఆశిస్తున్నారు. ఇద్దరూ పార్టీ కోసం పని చేస్తున్నారు.కొవ్వూరులో ఇన్‌చార్జిలేరు. ద్విసభ్య కమిటీ ఉంది. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు టికెట్లు ఆశిస్తున్నారు.ఏది ఏమైనా అధినేత నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రకటించిన జాబితాలో ఉన్నవారే అభ్యర్థులవుతారు. కానీ టీడీపీకి జనసేనతో పొత్తు ఉండడం వల్ల టీడీపీ అభ్యర్థుల టిక్కెట్ల ఖరారుపై టెన్షన్ నెలకొంది.జనసేన నుంచి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరం రూరల్ సీటు ఆశిస్తున్నారు. రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ టికెట్ ఆశిస్తున్నారు.కొవ్వూరు నుంచి మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నిడదవోలు నుంచి ఓ సినీ నిర్మాత జనసేన టికెట్ ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కొద్దిరోజుల్లోనే టీడీపీ,జనసేన అభ్యర్థులెవరనేది తేలనుంది. వైసీపీలో గందరగోళం ఇంకా కొనసాగుతూనే ఉంది. గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు కూడా వేరే చోటకు బదిలీ అయ్యే పరిస్థితుల వల్ల గందరగోళం ఉంది. ఇప్పటికే రాజమహేంద్రవరం రూరల్‌కు మంత్రి చెలుబోయిన వేణు, సిటీకి ఎంపీ మార్గాని భరత్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే.మిగతా చోట్ల ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. కొవ్వూరులో హోంమంత్రి తానేటి వనిత ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది బహుశా నాలుగో జాబితాలో స్పష్టత రావచ్చు. ఒకటి రెండు రోజుల్లో నాలుగో జాబితా ప్రకటించే అవకాశం ఉంది.ఆమెను కొవ్వూరు నుంచి కొందరు వ్యతిరేకిస్తున్నారు.ఆమె కూడా గోపాలపురం వైపు చూస్తున్నట్టు ప్రచారం ఉంది.ఆమెను మారిస్తే మరి కొన్ని మార్పులు ఉండవచ్చు. రాబోయే ఎన్నికలు ప్రజలకు ఓట్ల పండగ, రాజకీయనేతలకు ఓట్ల పందెంగా మారనుంది.

ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా

రాజమహేంద్రవరం, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ఓటర్ల తుదిజాబితా ఈనెల 22న ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ డా. కె.మాధ వీలత తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఓటర్ల తుది జాబితా ప్రకటించినా నామినేషన్లు స్వీకరణ తుది రోజు వరకూ ఓటరుగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు చెప్పారు. కొత్తగా నమోదు చేసిన వారి పేర్ల సప్లిమెంటరీ జాబితాగా ప్రకటిస్తామన్నారు. ఈవీఎంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి జన సమూహాలు ఉండే ప్రాంతాల్లో శాశ్వత సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అక్టోబరు 27నాటికి ఎస్ఎస్ఆర్ 2024 ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్లు 15,60,354 మంది ఉండగా అందులో 7,63,694 మంది పురుషులు 7,96,552 మంది మహిళలు 108 మంది ఇతరులు ఉన్నారన్నారు. కానీ జనవరి 1వతేదీ నాటికి ఈ సంఖ్య బాగా పెరిగిందని మొత్తం ఓటర్లు సంఖ్య 16,05,762 కాగా, పురుషులు 7,85,142 మహిళలు 8,20,515మంది ఉన్నా రన్నారు. సమావేశంలో జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్‌వో జే.నరసింహులు, ఆర్డీవో ఏ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ.. పండక్కే!

వస్తాం మళ్లొస్తాం



- ముగిసిన సంక్రాంతి పండుగ
- నాలుగు రోజులు మూడు క్షణాలుగా గడిపేసిన వైనం
- పట్టణాల వైపు పల్లెజనం ఉరుకులు పరుగులు
- బస్సులు..రైళ్లు ఫుల్.. రోడ్లపై భారీగా వాహనాలు
- శని, ఆదివారాల్లో మరిన్ని ప్రత్యేక బస్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

361 రోజులు ఎదురు చూసిన నాలుగు రోజుల పండుగ సరదా సరదాగా మూడు క్షణాల్లో గడిచిపోయింది. సొంత ఊరుతో సంతోషాన్ని పంచుకొని చుట్టాలు సొంతగూళ్ల దారి పట్టారు. వెళ్లొస్తాం 'మళ్లీ పండక్కి' వస్తాం.. అంటూ తీపి జ్ఞాపకాలతో బరువెక్కిన గుండెలతో.. చెమర్చిన కళ్లతో.. కులాసా కబుర్లను చెంగున కట్టుకొని.. కష్టసుఖాలను మనసున పెట్టుకొని మళ్లీ ఉరుకుల పరుగుల జీవనంలోకి బయలుదేరింది బంధుగణం. దీంతో రైళ్లు, బస్సులు కిక్కిరిసిపోగా.. కార్లు, బైకులతో రహదారులు నిండిపోయాయి.

సంక్రాంతికే ప్రత్యేకం

ఏడాదిలో ఏ పండుగకూ లేని ప్రత్యేకత సంక్రాంతికి ఉంది. ఈ పండుగ భోగి రోజు మొదలై నాలుగో రోజున ముక్కనుమతో ముగుస్తుంది. ముక్కనుమ రోజున అధిక శాతం మంది నైవేద్యాలు పెట్టుకుంటారు. బంధుగణానికి మాంసాహారంతో పసందైన విందును వండి వడ్డిస్తారు. ఆ రోజుతో ఆ ఏడాదికి సంక్రాంతికి వీడ్కోలు పలుకుతారు. నాలుగు రోజుల పాటు ఉల్లాసంగా గడిపి ఎన్నో ఊసులను మనసు నుంచి దించుకున్నారు. మరెన్నో కబుర్లను మన సున ముడేసుకున్నారు. పండక్కి మా ఊరెళ్తున్నాం.. చుట్టాలింటికి వెళ్తున్నాం.. అంటూ ఇరుగు పొరుగు వారికి నెల ముందు నుంచే సంబరంగా చెప్పుకొని రెక్కలు కట్టుకుని వాలిపోయారు. నాలుగు రోజులు మూడు క్షణాల్లో గడిచిన తర్వాత అప్పుడే పండుగ అయిపోయిందా!? అనుకుంటూ ఉసూరు మంటూ నగరాలకు బయలుదేరారు.సినిమాలు,షికార్లు, కోడిపందేల్లో జరిగిన ఎన్నో విషయాలను వారితో తీసుకెళ్లారు.ఆ తరువాత బంధు గణం బ్యాగులు సర్దుకొని తిరిగి పయనమవుతారు.ఈ నాలుగు రోజుల పండుగ అయిపోయాక నగరబాట పట్టిన తన వారి కోసం పల్లె మళ్లీ యథావిధిగా ఎదురుచూస్తూనే ఉంటుంది.

పల్లె ఎదురుచూపు..

సంక్రాంతికి మరో విశేషం ఉంది. ఆ పండుగకు సుమారు వారం రోజుల పాటు నగరాలు బోసిపోతాయి. హైదరాబాద్, బెంగళూరు, ముంబయి వంటి నగరాల్లో ట్రాఫిక్ తగ్గి పోయి రహదారులు ఖాళీగా దర్శనమిస్తాయి.ప్రవాసులతో కలుపుకొని బంధు ప్రవా హమంతా ఉరకలేసుకుంటూ పల్లె ఒడిలోకి చేరిపోతుంది. ఏడాదంతా ఉరుకులు పరుగుల జీవనంలో మమేకమైన పల్లెజనం పండుగకు వచ్చి కాస్త సేద తీరతారు. సంక్రాంతికి కళకళలాడిన పల్లెలు చుట్టాలు తిరుగుదారి పట్టడంతో ఖాళీగా దర్శనమిస్తుంటాయి. ఈ ఏడాదీ అదే కనిపించింది. కనుమ రోజు నుంచి మళ్లీ చాలా మంది పట్టణం బాటపట్టారు. ముక్కనుమ రోజు బుధవారం మరింతగా పెరిగింది. గురువారం దాదాపు గా అందరూ తమతమ ఇళ్లకు చేరిపోతారు.ఆ తరువాత నగరాల్లో హడావుడి మొదలైపోగా..పల్లెలు వెలితిగా కనిపిస్తాయి.

రైళ్లన్నీ ఫుల్..

పండుగకు ప్రధాన ప్రయాణ సాధనాలు రైళ్లు. పండుగ ప్లాన్ ఎలా ఉన్నా.. ముందుగా నెలల ముందే రానుపోను రిజర్వేషన్లు చేయించుకుంటారు. రిజర్వేషను దొరకని వాళ్లు ఏదోలా పల్లె ఒడిలో వాలిపోతారు. ఇప్పుడు ఈ ఏడాది పండుగకు వీడ్కోలు పలకడంతో రైళ్లు మరింత కిక్కిరిసి నడుస్తున్నాయి. రైల్వే ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నా రద్దీ క్లియర్ కావడం లేదు. ఇంటర్‌సిటీలు సరిపడా లేకపోవడంతో ప్రయాణపాట్లు తప్పడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు వెళ్లే రైళ్లు ఇసుకేస్తే రాలనంత ప్రయాణీకులతో నడుస్తున్నాయి. రాజమండ్రి రైల్వే స్టేషను అటు కోనసీమ, ఇటు ఏజెన్సీ ప్రాంతాలకు కూడా గేట్‌వే వంటిది. సుదూర ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచి రైళ్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో సాధారణ రోజుల్లో రోజులు 10వేల మంది ప్రయాణాలు సాగిస్తే.. సంక్రాంతికి ఆ సంఖ్య రెట్టింపు అవుతుంది.

బస్సుల కిటకిట

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 17 : హైదరాబాద్, బెంగళూరు నుంచి పెద్ద పండక్కి సొంతూళ్లకు వచ్చిన జిల్లా ప్రయాణికులు తిరుగు పయనమవుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌కు ఎక్కువ మంది తిరుగు ప్రయాణాలు ప్రారంభించడంతో జిల్లా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. తిరుగుప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రారంభించింది. బుధవారం రాత్రి నుంచి ఈ స్పెషల్ సర్వీసులు మొదలయ్యాయి. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి ఏడు షెడ్యూలు బస్సులతో పాటు మరో ఏడు స్పెషల్ సర్వీసులు హైదరాబాద్ బయలుదేరి వెళ్లాయి. ఇవన్నీ ఫుల్‌రష్‌గా బయలుదేరి వెళ్లినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. వీటితో పాటు శ్రీకాకుళం, ఇచ్ఛాపురం ప్రాంతాల నుంచి కూడా హైదరాబాద్‌కు షెడ్యూలు బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు వయా విజయవాడ సూపర్ లగ్జరీ బస్సులకు రూ.830లు ఛార్జి చేస్తుండగా, వయా ఖమ్మం రూ.790 వసూలు చేస్తున్నారు. ఇంద్ర ఏసీ సర్వీసుకు రూ.1,050 ఛార్జిగా ఉంది. స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తుండడంతో హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులకు మంచి డిమాండ్ ఏర్పడింది. రైళ్లలో టిక్కెట్లు దొరికే పరిస్థితి లేకపోవడంతో సాధారణ, మధ్యతరగతి ప్రయాణీకులు ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం వరకూ ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపేందుకు టైం టేబుల్ సిద్ధం చేసింది. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌కు ప్రయాణీకుల రద్దీ భారీగా ఉండొచ్చనే అంచనాలతో ఆ రెండు రోజుల్లో మరిన్ని స్పెషల్ బస్సులు నడపాలని జిల్లా ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.



దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్..

ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నాయి. ముందస్తు రిజర్వేషన్లు లేనివారు, అప్పటికప్పుడు ప్రయాణాలు సాగించాల్సిన వారు ఎక్కువ మంది ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో టిక్కెట్‌పై రూ.2 వేల నుంచి రూ.2,500 వరకూ వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండు ఏరియాలో పెద్ద సంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ ఉన్నాయి. లాలాచెరువు, కోటిపల్లి బస్టాండు వంటి చోట్ల బోర్డింగ్ పాయింట్లు ఉన్నా టిక్కెట్లు బుకింగ్ ఆఫీసులన్నీ ఇక్కడే ఉన్నాయి. పండుగ డిమాండ్ నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణీకులను దోచేస్తున్నా రవాణాశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సెలవులు పొడిగింపు.. 22 నుంచి స్కూల్స్

రాజమహేంద్రవరం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులను ప్రభుత్వం రెండు రోజులు పొడిగించిందని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకూ ఇచ్చిన సంక్రాంతి సెలవులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు 20వ తేదీ వరకూ పొడిగించారన్నారు. 21వ తేదీ ఆదివారం కావడంతో 22 నుంచి స్కూల్స్ పనిచేస్తాయన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు అన్ని ప్రభుత్వ ప్రైవేటు, జడ్‌పీపీ/ఎంపీపీ, అయిడెడ్ పాఠశాలలకూ వర్తిస్తాయని..ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అంబేడ్కర్ ఛాయాచిత్ర ప్రదర్శన తిలకిస్తున్న కలెక్టర్ తదితరులు

ఆదర్శనీయుడు అంబేడ్కర్ : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ,జనవరి 17: దేశ ప్రజలందరికి అంబేడ్కర్ ఆదర్శనీయుడని కలెక్టర్ మాధవీలత అన్నారు. సామాజిక సంకల్ప కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జీవిత విశేషాల ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను కలెక్టర్ మాధవీలత ప్రారంభించి మాట్లాడారు. అంబేడ్కర్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం ,రాజ్యాంగ రచన వివిధ ఘట్టాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు ఎంతో ఆసక్తిని కలిగించాయన్నారు. సీఎం జగన్ ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల విగ్రహం అంబేడ్కర్ సేవలకు ప్రతిరూపంగా నిర్మించి స్మృతివనాన్ని ప్రారంభించనున్నారని చెప్పారు. రెండు రోజుల పాటు అంబేడ్కర్ ఛాయా చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ అంబేడ్కర్ భారతదేశానికి మార్గనిర్దేశకులుగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్‌వో జి.నరసింహులు,ఆర్‌డీవో చైత్రవర్షిణి, కేఆర్‌సీ డిప్యూటి నాయక్ , డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ ఎం.సనత్ కుమారి, సీపీవో ఎల్ అప్పలకొండ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్ పాల్గొన్నారు.

ఊరంతా పండగ..

24 గంటల పాటు గౌరీ శంకరుల రథోత్సవం



గౌరీ శంకరుల రథోత్సవానికి హాజరైన భక్తజనం



శ్రీరంగపట్నంలో చీర, సారెను ఊరేగిస్తున్న భక్తజనం

కోరుకొండ, జనవరి 17 : ఊరంతా పండగే.. ఎక్కడెక్కడి నుంచో జనం కదిలొచ్చారు.. గౌరీశంకరుల రథోత్సవం కన్నులారా తిలకించారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో బుధవారం గౌరీశంకరుల రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రథోత్సవానికి ముందు గ్రామానికి చెందిన ఆడబడుచులు సుమారు వెయ్యి మంది అమ్మవారికి సారె, చీరలు తీసుకెళుతూ గ్రామం అంతా ఊరేగిం చారు.. ఈ సారె ఊరేగింపులో టీడీపీ నాయకులు బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి గ్రామస్తులతో కలిసి సారె ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం గౌరీచౌక్ వద్ద రథానికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవం ప్రారంభించారు.సుమారు 24 గంటలు పాటు నిర్విరామంగా రథోత్సవం సాగు తోంది. సారె తీసుకొచ్చిన 1000 మంది మహిళలకు జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. అమ్మవారికి స్వీట్లు, పండ్లు, పువ్వులు అందజేశారు.

విద్యుత్ చౌర్యం.. రూ.74 వేల జరిమానా

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: విద్యుత్ నిఘా శాఖ దాడులు ముమ్మరం చేసింది. రాజమహేంద్రవరం డీపీఈ బృందం -1 ఏడీఈ ఎల్ సతీష్ నాయక్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (యాంటి తెఫ్ట్‌స్క్వాడ్) వారి సిబ్బందితో కలిసి సీతానగరం మండలం నల్లగొండ గ్రామంలో కోళ్ళ ఫారంపై బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. అక్కడ విద్యుత్ మీటర్ బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తుండడాన్ని గుర్తించి సంబంధిత కోళ్ళఫారం యజమానికి రూ.74,345 అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం దాడులు చేస్తామన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన మద్దిపాటి



గోపాలపురం, జనవరి 17: ఉండవల్లిలోని నారా లోకేశ్ నివాసంలో ఆయనను బుధవారం కలిసి పద్మావతి, అలివేలుమంగ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేసినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. ఈ సందర్భంగా నల్లజర్ల మండలంలో ఈ నెల 27న జరిగే రాకదలిరా బహిరంగ సభ నిర్వహణ, సభా ప్రాంగణం ఏర్పాట్లు, జనసమీకరణ తదితర అంశాలపై సుమారు గంటసేపు చర్చించినట్టు తెలిపారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు, జనవరి 17: రోగులు, బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా రోటరీ పౌష్టికాహారం అందిస్తోందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు అన్నారు. బుధవారం నిడదవోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బలగం స్వర్ణలత ఆర్థిక సహకారంతో 51 మందికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బలగం అప్పారావు, బొజ్జా పాపారావు, పొన్నా సుబ్రహ్మణ్యం, గొన్నాబత్తుల రామారావు, పోలదాసు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజును కలిసిన టీడీపీ నాయకులు



రఘురామకృష్ణంరాజుతో టీడీపీ నాయకులు

నిడదవోలు, జనవరి 17: నిడదవోలులోని నెహ్రూ బొమ్మ సెంటరులో బుధ వారం ఎంపీ రఘురామకృష్ణంరాజును స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగకు భీమవరం వచ్చిన ఆయన తిరిగి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు వెళుతున్న సందర్భంగా నిడదవోలులో టీడీపీ నాయకులు కలసి శాలువా కప్పారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి, జనవరి 17: ఈ నెల 19న విజయవాడలో జరిగే బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. దేవరపల్లిలో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరిస్తారని, నియోజకవర్గం నుంచి 20 బస్సుల్లో వెళ్లనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైసీపీ కన్వీనర్ సతీష్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వెలగా శ్రీనివాస్, మాదవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిడదవోలులో నంగాలమ్మ సంబరాలు



నంగాలమ్మతల్లి ఊరిగింపులో పాల్గొన్న పురజనులు

నిడదవోలు, జనవరి 17: నిడదవోలు గ్రామ దేవత నంగాలమ్మ తల్లి సంబరాలు ఘనంగా నిర్వహిస్తారు. బుధవారం అమ్మవారి ఊరేగింపు స్థానిక యాదవుల వీధికి విచ్చేయగా మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, యాదవ సంఘం అధ్యక్షుడు గంగుల గోపీయాదవ్, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, బిర్రే పార్వతి, మాజీ కౌన్సిలర్ రాజా రామ్‌మోహన్‌రయ్, యాదవ సంఘం నాయకులు స్వాగతం పలికి హారతులిచ్చి పూజలు చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత లాలాచెరువు జట్టు

గోపాలపురం, జనవరి 17: క్రీడాకారులు గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో వైఎస్సార్ ఆర్మీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. 37 టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నీలో రాజమహేంద్రవరం లాలాచెరువు టీమ్ విజేతగా నిలిచింది. విజేత జట్టుతోపాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు, క్రీడాకారులకు ఎమ్మెల్యే తలారి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ పైడి శిరీష, స్పోర్ట్స్ డైరెక్టర్ వరలక్ష్మి, జిజ్జువరపు అన్నవరం, ఉపసర్పంచ్ ముల్లంగి శ్యామ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

భావనాఋషి మహోత్సవాలు



భద్రావతి సమేత భావనాఋషి

తాళ్లపూడి, జనవరి 17: తాళ్లపూడిలో పద్మశాలీయుల ఆరాధ్యదైవం భద్రావతి సమేత భావనాఋషి మహోత్సవాలు బుధవారం ముగిసాయి. వారం రోజులుగా పుష్కరవీధిలోని ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉత్సవ ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలు, కోయ డాన్సులు, వేషధారణలు, గరగ నృత్యాలతో సాగిన ఈ ఊరేగింపులో శూల ధారణ అందరినీ ఆకట్టుకుంది. గ్రామంలోని ఆడపడుచుల రాకతో సందడి నెలకొంది. ఉత్సవ కమిటీ సభ్యులు కోదాటి సత్యనారాయణ, ఉడతా వీరేంద్ర కుమార్, నక్కా చిట్టిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీతారాముల తలంబ్రాల ధాన్యం అందజేత



తలంబ్రాల ధాన్యం అందిస్తున్న రామకృష్ణ దంపతులు

నల్లజర్ల, జనవరి 17: భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణానికి గోటితో వలిచే తలంబ్రాల కోసం ధాన్యాన్ని శ్రీరామ ఆధ్యాత్మిక సేవ సమితి కార్యదర్శి వెదుళ్ళ రామకృష్ణ దంపతులు బుధవారం మండలంలోని జగన్నాథపురం సీతారామ భజన మండలి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సవలం రామకృష్ణ,మైనం వెంకట బ్రహ్మయ్య పాల్గొన్నారు.

'షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: వైఎస్ షర్మిలను పీసీసీ అధ్యక్షురాలిగా కొత్తగా నియమించడంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి విజయకుమార్ అన్నారు.ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును సీడబ్ల్యూసీ ప్రత్యేక సభ్యుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

'షోకాజ్'కు సంజాయిషి

- అధికారులకు అందజేసిన అంగన్‌వాడీలు
- కొవ్వూరులో తిరస్కరించిన అధికారులు
- 37వ రోజు కొనసాగిన నిరవధిక దీక్షలు



కొవ్వూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలు

కొవ్వూరు, జనవరి 17: జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా వేతనం చెల్లించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 37వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులకు సమాధానాలు రాసుకుని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఐసీడీఎస్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పీడీ ఎంతసేపటికీ కార్యాలయానికి రాకపోవడంతో పీవోడబ్ల్యు నాయకురాలు ఈమని మల్లిక.. పీవో మమ్మికి ఫోన్ చేసి రిప్లై నోటీసులు తీసుకోవడానికి కార్యాలయానికి రావాలని కోరారు. దీంతో పీవో మాట్లాడుతూ తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని, రిప్లై నోటీసులు స్వీకరించబోమని చెప్పారని తెలిపారు. సాయంత్రం 4గంటల వరకూ కార్యాలయం వద్దనే అంగన్‌వాడీలు నిరీక్షించారు. కార్యాలయ సిబ్బందికి రిప్లై నోటీసులు ఇవ్వడానికి ప్రయత్నించగా వారు కూడా నిరాకరించారు. సీఐటీయూ నాయకుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ నోటీసులకు సమాధానం తీసుకోకుండా తిరస్కరించడం చట్ట వ్యతిరేకమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యోగులకు నోటీసులు ఇచ్చినపుడు రిప్లై నోటీసులు ఇచ్చే హక్కు ఉద్యోగులకు ఉందన్నారు. నాలుగేళ్లుగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, పెరిగిన కరువు భత్యం పాయింట్లు లెక్కకట్టినా 469 పాయింట్లకు రూ.3630 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సీహెచ్.బ్రహ్మమ్మ, ఎ.నరసమాంబ, బీవీ పద్మజ, బి.మధురవల్లి, ఎల్.వరలక్ష్మి, బి.నాగమణి, కేసీ లక్ష్మి, కేవీ అరుణ, ఎస్.ఉషాలక్ష్మి, ఎస్.శాంతకుమారి పాల్గొన్నారు.



గోపాలపురం ఐసీడీఎస్ కార్యాలయంలో సంజాయిషి పత్రాలు ఇస్తున్న దృశ్యం



పెరవలి ఎంపీడీవో కార్యాయలం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పెరవలి ప్రాజెక్టు పరిధిలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంటి కృష్ణ మాట్లాడుతూ అందరికీ షోకాజు నోటీసులు ఇచ్చారని వాటికి సమాధానాలు కార్యాలయంలో అందజేశామన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ కనీస వేతనం పెంచే వరకు సమ్మె చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు లక్ష్మీకుమారి, కృష్ణవేణి, నాగవేణి, విశాలి, శాంతకుమారి, రామలక్ష్మి, లక్ష్మీ మాధురి పాల్గొన్నారు.

గోపాలపురం: నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.భగవత్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో అంగన్వాడీల పాత్ర కీలకమని, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, ఎస్మా చట్టం ఉపయోగించి భయపెట్టాలని చూడడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమన్నారు. నోటీసులను రిజిస్టరు పోస్టులో పంపించి అంగన్వాడీలను భయపెట్టాలని చూస్తే ఉద్యమం తీవ్రతరం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు అంగన్వాడీలు సంజాయిషి లేటర్‌ను సీడీపీవోకి సమర్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ అధ్యక్షురాలు రామలక్ష్మి, విజయలక్ష్మి, భవాని, ప్రభా, వెంకటలక్ష్మి, రామలక్ష్మి, సుబ్బలక్ష్మి, గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పాలంగిలో వికసిత భారత్ సంకల్పయాత్ర



పాలంగిలో సంకల్పయాత్ర రథం వద్ద అధికారులు, నాయకులు

ఉండ్రాజవరం, జనవరి 17: మండలంలోని పాలంగి, కెసావరం గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. అధికారులు, బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధానమంత్రి మోదీ సందేశాన్ని ప్రజలకు టీవీ ద్వారా వినిపించారు. పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పుస్తకాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీఎస్‌కే రాజు, ఈవోపీఆర్డీ జేవీడీవీ ప్రసాద్, సర్పంచ్‌లు బొక్కా శ్రీనివాస్, నార్ని రామకృష్ణ, నాయకులు పాలాటి శరత్‌కుమార్, సీహెచ్ సత్యనారాయణ, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ ఎం.విక్టర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్‌జాని పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం



కొవ్వూరు, జనవరి 17: గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లాబేగ్, ఏఐసీసీ సభ్యుడు అమర్షహ బేగ్‌మొహమ్మద్‌ల ఆధ్వర్యంలో జరిగింది. వైఎస్ షర్మిళ ఏపీసీసీ అధ్యక్ష పదవి పొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన గునుకురి సుశాంత్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జ్యేష్ఠ సతీష్, వేగా రామకృష్ణ, సాకే వుల్లారావు, మెట్ట సుబ్బారావు, ఫ్రాన్సిస్, కొడమంచిలి చంద్రశేఖర్, జి.బుచ్చిబాబు పాల్గొన్నారు.

దాత బలరామయ్యకు సత్కారం



బలరామయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దేవరపల్లి, జనవరి 17: దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి స్థానిక ఆర్యవైశ్య సంఘం ప్రముఖుడు తీగల బలరామయ్య రూ.7 లక్షల విరాళం అందజేశారు. ఈ విరాళంతో ఆలయానికి టైల్స్ వేశారు. ఈ నేపథ్యంలో బలరామయ్యను ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు బుధవారం సత్కరించి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్నక్రమంలో సుంకర సుబ్రహ్మణ్యం, గుడ్ల వెంకటేశ్వరరావు, యాగంటి శ్రీనివాసు, చిట్లు వెంకటేశ్వరరావు, పిచ్చుకల పల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

కొవ్వూరు, జనవరి 17: రోడ్డు భద్రతా మాసోత్సవాలను బుధవారం కొవ్వూరు డిపో మేనేజరు వైవీవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ ఏటా జనవరిలో చేపట్టే రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డీఎం మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వారితో కండక్టర్లు కూడా అండగా ఉండి సహకరించాలన్నారు. అలాగే గేరేజ్ సిబ్బంది మెరుగైన టూల్స్, మెయింటెనెన్స్ ద్వారా బస్సులకు బ్రేక్‌డౌన్‌లు లేకుండా ప్రయాణికులు ఇబ్బం దులు పడకుండా చూడాలని కోరారు. డ్రైవర్లుకు భద్రతా దృష్ట్యా ఏటా మెడికల్ చెకప్ చేయిస్తున్నామన్నారు. ప్రయాణికుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కలిగించడానికి రోడ్డు సేఫ్టీ అవగాహన సదస్సులు, రక్తదాన శిబిరాలు ఫిబ్రవరి 14 వరకూ నిర్వహిస్తామని డీఎం తెలిపారు.

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా
షర్మిళారెడ్డి బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా షర్మిళారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత రాజమహేంద్రవరం హైటెక్ బస్టాండ్ సెంటర్‌లోని మేడపాటి సీతారామిరెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అక్కడ నుంచి భారీగా వాహనాలతో విజయవాడ తరలివెళ్లి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీక రించారు. గతంలో ఆమె రుడా ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, జోగి రమేష్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పేరి కామేశ్వరరావు, ఏపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్, పెద్దాపురం నేత దవులూరి దొరబాబు తదితరులు అభినందనలు తెలిపారు.ఆమె వెంట భర్త అనిల్ రెడ్డి ఉన్నారు.

శివాంజనేయ నర్సరీని సందర్శించిన హైకోర్టు సీజే



కడియం, జనవరి 17: కడియపులంక మల్లు పోలరాజుకు చెందిన శివాంజనేయ నర్సరీని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ టాకూర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పోలరాజు మొక్కను అందజేశారు. సీజె నర్సరీలో వివిధ రకాల మొక్కలను తిలకించారు. బొన్సాయ్ మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంత చక్కని పచ్చని ప్రపంచాన్ని తిలకించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు, జనవరి 17: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. కొవ్వూరుకు చెందిన అన్నమరెడ్డి విశ్వనాథం ఈ నెల 16వ తేదీ సాయంత్రం గామన్ వంతెన టోల్ ప్లాజా వద్ద బైక్‌తో రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది విశ్వనాథం తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు తెలిపారు.

నేడు రాజమహేంద్రవరంలో మెగా వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం రాజమహేంద్రవరంలో భారీ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తెలిపారు. కంబాలచెరువు వద్ద గల ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జీకే స్పందన చారిటబుల్ ట్రస్ట్, ఎన్‌టీఆర్ ట్రస్ట్, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ,హాస్పటల్ సంయుక్త నిర్వహణలో గురువారం ఉదయం 10 గంటల నుంచి శ్రీరామ్‌నగర్‌లోని తన నివాసం వద్ద ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. చంద్రబాబుకు 17ఎ అప్లికేబుల్ అవుతుందా లేదా అనేది సుప్రీంకోర్టు నిర్ణయిస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, జక్కంపూడి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీరామ విజయయాత్ర



రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 17: అయోధ్య శ్రీరామ మందిరంలో ఈనెల 22న ప్రాణప్రతిష్ఠ జరుగుతున్నందున రాజమహేంద్రవరంలో ఈ నెల 19న శ్రీరామ విజయయాత్ర నిర్వహిస్తున్నామని బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ సత్యగోపినాథ్ దాస్ ప్రభూజీ తెలిపారు. రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 19న మధ్యాహ్నం 2 గంటలకు రాజమహేంద్రవరం ఏవి అప్పారావు రోడ్డు రామాలయం సెంటర్ నుంచి శ్రీరామ విజయ యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలంతా పాల్గొనాలని యాత్ర కన్వీనర్ తోట సుబ్బారావు కోరారు. యాత్ర సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందని 10 వాహనాలు, ఐదు వేల మంది భక్తజనం పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో రాము ,మురారి హరిదాసు, సదా రామదాసు, సుబ్రహ్మణ్యం ,హరి తదితరులు పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ జాతరలో భక్తుల నిలువు దోపిడీ

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 17: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ భక్తులను నిలువు దోపిడీ చేస్తోందని, పొట్ట కూటి కోసం వచ్చిన చిరువ్యాపారుల నుంచి రూ.2 వేలు వసూలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నడుస్తోందని, ఆలయాల వద్ద సత్సంగా లను విడిచిపెట్టి రాజకీయాలు చేస్తున్నారని, అమ్మవారికి ఏటా వచ్చే చందాల లెక్కలు చెప్పడం లేదని పేర్కొన్నారు. చిరు దుకాణాల వద్ద వసూలు చేస్తున్న సొమ్ములకు రశీదులు ఇవ్వడం లేదని ఈ సొమ్మంతా ఎక్కడికి వెడుతుందో కమిటీ సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, బాసి, కర్రి వెంకటరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, నూతిక బాబూరావు, మామిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిదండ్రులిచ్చే విలువైన ఆస్తి విద్యే

తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 17: పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే విలువైన ఆస్తి విద్య మాత్రమేనని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ఆవరణలో బుధవారం 5,6,7,8,910వ తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు ఐఐటీ, మెడికల్, ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు జరిగింది. తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలందరూ ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్‌కి బాగా అలవాటుపడి చదువు మీద శ్రద్ధ తగ్గిపోతుందన్నారు. పిల్లలను వాటికి దూరంగా ఉంచాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని విద్యా సంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి అన్నారు. ఈ సదస్సులో విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుర్గేష్‌కు టీడీపీ నేతల పరామర్శ



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 17: జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల దుర్గేష్ భార్య ఉషారాణి మరణించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరం లోని దుర్గేష్ నివాసానికి వెళ్లి ఉషారాణి చిత్రపటానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పా రావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, కోనేరు వివేక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా బుధవారం సాయంత్రం ఎంపీ రఘురామకృష్ణంరాజు.. కందుల దుర్గేష్ నివాసానికి వచ్చి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అక్కడి నుంచి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ పయనమయ్యారు.

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం



చాగల్లు: ఊనగట్ల జడ్పీ హైస్కూల్ 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



గోపాలపురం జడ్పీ హైస్కూల్ 2005-06 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు



కొవ్వూరు ఏబీఎన్ కాలేజీ 2015-2017 బ్యాచ్ పీజీ కెమిస్ట్రీ విద్యార్థులు

చాగల్లు, జనవరి 17: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వచ్చిన వారంతా తమతోపాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితులను కలుసుకుని సమ్మేళనాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహా చేరుకుని చిన్ననాటి మధుర స్మృతులను, అల్లరి చేష్టలను గుర్తుచేసుకుని, ప్రస్తుత పరిస్థితులను పంచుకుంటూ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా చాగల్లు మండలం ఊనగట్ల జడ్పీ హైస్కూల్లో 1996-97 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదే స్కూల్లో జరిగింది. ఆనాటి ఉపాధ్యాయులు ఆచార్య, గోపాలకృష్ణ రాజు, రాజ్యలక్ష్మితోపాటు ప్రస్తుత పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావును సన్మానించారు. కాగా ఆర్ఎల్ శ్రీనివాసరావు, కె.లక్ష్మీనారాయణ, బి.రామకృష్ణ, ఎం.వెంకటరావు తదితరులు ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికి కృషి చేశారు.

గోపాలపురం: గోపాలపురం జడ్పీ హైస్కూల్ 2005-06 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ప్రధానోపాధ్యాయుడు దివంగత సత్యనారాయణను స్మరించుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ కాలేజీ ఆఫ్ సైన్స్ కళాశాలలో 2015-2017 బ్యాచ్ పీజీ ఆర్గానిక్ అండ్ ఎనలిటికల్ కెమిస్ట్రీ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ ఎస్‌వీ సుబ్బా రావు, పీఈ డైరెక్టర్ సీహెచ్ చలపతిరావు, ఎండీ నజీర్‌ఖాన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో రమ్యశ్రీ, హేమశ్రీ, హరిశ్రీ, పవన్, ప్రసన్న, రమ్య, సుధ, భవ్య, కుమార్, మణికంఠ, సాయికృష్ణ, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	గుంటూరుకారం
వై.స్క్రీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్